

నిండుకుండలా నరసరావుపేట వలపచెరువు

చెరువులకు.. జలకళ

▸▸ పుష్కలంగా సాగునీరు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రెండు మాసాలుగా భారీ వర్షాలు కురిశాయి. వాగులు.. వంకలు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సాగర్ కాల్వకు కూడా పుష్కలంగా నీటి సరఫరా జరుగుతుంది. దీంతో జిల్లావ్యాప్తంగా పూర్తిస్థాయిలో నీటి నిల్వలు చేరుకోవడంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. చెరువుల్లో నీటి నిల్వలతో వ్యవసాయానికి నీటి భరోసా వచ్చింది. జలకళతో చెరువుల పరిసర ప్రాంతాల్లో కూడా భూగర్భ జల మట్టాలు పెరిగాయి. 228 మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం 2.84 టీఎంసీలు కాగా ఇప్పటికే 2.3 టీఎంసీల నిల్వలు ఉన్నాయి. 80.9 శాతం చెరువులు నిండినట్లు జలవనరులశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. 118 చెరువులు పూర్తిగా నిండాయి. 47 చెరువుల్లో 75 శాతానికిపైగా, 36 చెరువుల్లో 50 శాతానికి పైగా, 14 చెరువుల్లో 25 శాతానికి పైగా నీటి నిల్వలు ఉండగా ఏడు చెరువులను నీటితో నింపాల్సి ఉంది.

ఉపాధికి ఇక పక్కా హామీ

- అవినీతికి చెక్ పెట్టేలా ఈ-కేవైసీ
- బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట
- శ్రామికులకు రెండు సార్లు ముఖ హాజరు
- నవంబరు నుంచి నూతన విధానం అమలు

ఉపాధి హామీ పనుల్లో మస్టర్ల మాయాజాలం సర్వసాధారణమైపోయింది. హాజరు విధానంలో ఉన్న లొసుగులకు తోడు కొంతమంది ఉద్యోగుల అండదండలతో నిధులను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారు. సోషల్ ఆడిట్ నివేదికల్లో పలుమార్లు అవినీతి బాగోతాలు బట్టబయలైనప్పటికీ మస్టర్ల కనికట్టు మాత్రం ఆగడం లేదు. ఉపాధి అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకట్ట పడాలనే కృతనిశ్చయానికి కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు వచ్చాయి. దానిలో భాగంగానే పనులకు హాజరయ్యే ప్రతి శ్రామికుడికి ఈకేవైసీ చేపట్టి ముఖ హాజరును తప్పనిసరి చేయనుంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను గడచిన నెలలోనే ప్రభుత్వం విడుదల చేసింది. శ్రామికుల జాబ్ కార్డును ఆధార్‌కు అనుసంధానం చేయడంతో పాటు, ఈ-కేవైసీ ప్రక్రియను కూడా ముమ్మరం చేసింది.



కర్లపాలెం మండలంలో జరుగుతున్న ఈ-కేవైసీని పరిశీలిస్తున్న డ్వామా పీడీ విజయలక్ష్మి(ఫైల్ ఫొటో)

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకంలో నమోదై ఉన్న శ్రామికులందరినీ ఈ కేవైసీ గొడుగు కిందకు తేవడం కోసం ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు విధించింది. నవంబరు మొదటి వారం నుంచి శ్రామికుల ముఖ హాజరు విధానాన్ని పక్కాగా అమలు చేసి ఉపాధి అక్రమాలకు చెక్ పెట్టనున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా బాపట్ల జిల్లాలో మొత్తం 4,85,408 శ్రామికులు నమోదై ఉన్నారు. ఇప్పటి వరకు ఈ కేవైసీని 1,61,399 మంది శ్రామికులు పూర్తి చేసుకున్నారు. గుంటూరు జిల్లాలో 2,14,450 మంది ఉపాధి హామీ శ్రామికులు ఉండగా 66,561 మంది ఈ కేవైసీ గొడుగు కిందకు చేరారు. అదే విధంగా పల్నాడు జిల్లాలో అత్యధికంగా 6,04,740 మంది శ్రామికులు ఉండగా, ఇందులో 1,66,763 మంది ఈ కేవైసీ పూర్తయింది. శాతాల వారీగా పరిశీలిస్తే బాపట్ల జిల్లాలో 33.53, గుంటూరు జిల్లాలో 31.72, పల్నాడు జిల్లాలో 28.12 శాతం ఈ కేవైసీ మాత్రమే ఇప్పటి వరకు పూర్తయింది. ప్రభుత్వం ఇచ్చిన గడువుకు ఇంకా మూడు వారాలే మిగిలి ఉండడంతో (మిగతా 6లో)

బాధ్యతల నుంచి తప్పించుకోలేరు

ఇకపై దొంగ మస్టర్ల విషయంలో సంబంధిత సిబ్బంది తమ బాధ్యతల నుంచి తప్పించుకోలేని విధంగా యాప్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజైన్ చేశాయి. ఫీల్డ్ అసిస్టెంట్లు పని ప్రదేశాల్లో తీసే ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు క్రమం తప్పకుండా పరిశీలించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ మొత్తం వ్యవహారంలో నిర్లక్ష్యంగా ఉండే సిబ్బందిపై చర్యలకు వెనకాడవద్దనే ఆదేశాలను కూడా కేంద్రం స్పష్టంగా ఇచ్చింది. సోషల్ ఆడిట్‌లో భాగంగా గతంలో ఏవైనా అక్రమాలు వెలుగుచూస్తే సంబంధిత విభాగాలన్నీ కూడా ఒకదానిపై ఒకటి నెపం వేసుకుని కాలం గడిపేవి. కానీ, నూతన ఆదేశాల ప్రకారం అక్రమాలకు ఆయా విభాగాల సిబ్బందే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

23 నాటికి లబ్ధిదారులకు

టిడ్కో గృహాలు

- కేటాయించిన గృహాల్లోనే నివాసం ఉండాలి
- వయసురీత్యా బ్యాంకు రుణం పొందలేకపోతే.. కుటుంబంలో మరొకరికి అవకాశం: కలెక్టర్ కృతికాశుక్లా



ఉప్పలపాడు వద్ద ఎన్‌టీఆర్ కాలనీలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మించిన టిడ్కో గృహాలను ఈ నెల 23 నాటికి లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. నరసరావుపేట మండలం కేశానుపల్లి పంచాయతీ పరిధిలో నిర్మించిన 1,504 టిడ్కో గృహాలను శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లా, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లను అందజేసిన వెంటనే టిడ్కో గృహ లబ్ధిదారులందరూ నివాసం ఉండాలని స్పష్టం చేశారు. కొందరు లబ్ధిదారులకు వయస్సు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బ్యాంకు రుణం పొందలేక పోతున్నారని.. అటువంటి వారికి ఆ కుటుంబంలో మరొకరి పేరుపై రుణం అందించడం జరుగుతుందన్నారు. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న 150 మంది కలెక్టర్ వద్దకు వచ్చి తమ సమస్యలను వివరించారు.

ఎన్టీఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు

నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రత్యేక కృషి చేస్తానని కలెక్టర్ కృతికా శుక్లా నివాసితులకు తెలిపారు. కాలనీ పర్యటనలో భాగంగా ప్రధాన, అంతర్గత రోడ్లను నిర్మించాలని నివాసితులు కలెక్టర్‌ను కోరారు. కాలనీలో ఎక్కువ శాతం ఉన్న ఖాళీ స్థలాల వల్ల విష పురుగులు, జంతువులు ఇళ్లలోకి వస్తున్నాయన్నారు. కాలనీ ప్రధాన రహదారిలో ఉన్న వంతెనను పరిశీలించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ టిడ్కో గృహాలను వీలైనంత త్వరగా అందించి, లబ్ధిదారుల సొంతింటి కల నెరవేర్చాలని కోరారు. టిడ్కో గృహాల వద్ద అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం లేకుండా ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాత్రిళ్లు పోలీసు గస్తీ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ, మునిసిపల్ మాజీ ఛైర్మన్ సుబ్బరాయ గుప్తా, కమిషనర్ జస్వంత్‌రావు, తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎస్‌బీఐ రీజినల్ మేనేజరు రవికుమార్ పాల్గొన్నారు.

సాగుకూ.. సోలార్

విద్యుత్ భారం తగ్గేలా కసరత్తు

194 ఎకరాల్లో ప్లాంట్లు.. 42.5 మెగా వాట్ల లక్ష్యం

రూ.191.25 కోట్లతో దుర్గి, మాచర్ల, వెల్దుర్తిలో ప్లాంట్లు



పీఎం కుసుమ్ సోలార్ ప్లాంట్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల విద్యుత్ కష్టాలకు చెక్ చెప్పేలా.. విద్యుత్ ఉత్పత్తి భారం తగ్గించుకునేలా ప్రభుత్వం వ్యవసాయానికి సోలార్ విద్యుత్ వినియోగం చుకునేలా కసరత్తు చేపట్టింది. ఇప్పటికే గృహ వినియోగానికి సోలార్ విద్యుత్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ క్రమంలో సాగుకు అవసరమైన విద్యుత్‌ను సోలార్ ద్వారా ఉత్పత్తి చేసి వినియోగించుకునేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. జిల్లాలో వ్యవసాయానికి విద్యుత్ వినియోగం అధికంగా ఉంది. ఈ క్రమంలో వ్యవసాయానికి ఉచితంగా అందించే విద్యుత్‌ను ఎండ ద్వారా తయారు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. జిల్లాలో 42.5 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్రధానమంత్రి కుసుమ్ పథకం ద్వారా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. రానున్న ఏడాదిలో వ్యవసాయానికి సోలార్ విద్యుత్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నది. రూ.191.25 కోట్ల అంచనాతో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. తొలి విడతలో అత్యధికంగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్న ప్రాంతాలను సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఎంపిక చేశారు. వ్యవసాయానికి వినియోగం కాని భూముల్లోనే సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో దుర్గి, మాచర్ల వెల్దుర్తి మండలాల్లో 194 ఎకరాలను విద్యుత్ శాఖ సేకరించింది. ఇందులో 97 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగతా భూమిని రైతుల నుంచి లీజు పద్ధతిలో సేకరించింది. త్వరలో పనులు ప్రారంభించేందుకు విద్యుత్‌శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు సంబంధించిన ఏజెన్సీని కూడా ఖరారు చేసింది.

విద్యుత్ కనెక్షన్లకు ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఎక్కడికక్కడ పూర్తి స్థాయిలో ఉన్నాయి. దీంతో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 1825 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. మార్చి కల్లా మరో 1809 వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చే దిశగా పనులు జరుగుతున్నాయి.

27,469 గృహాలకు సోలార్ విద్యుత్

ఇప్పటికే సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించే క్రమంలో సూర్యఘర్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల ఇళ్లను ఎంపిక చేశారు. 27,496 ఎస్సీ, ఎస్టీ గృహాలకు సోలార్ ప్యానళ్లను ఉచితంగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధమైంది. సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసిన స్థలానికి చదరపు అడుగుకు నెలకు రూపాయి అద్దె కూడా చెల్లించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



సోలార్ విద్యుత్‌ను గృహ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో వ్యవసాయానికి సోలార్ విద్యుత్‌ను సరఫరా చేసేందుకు 194ఎకరాల్లో ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నాం.


-పత్తిపాటి విజయకుమార్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ

అమరావతిలో ప్రభుత్వ భవనాలకు

రూ. 212.22 కోట్లు

రాజధానిలో 4 స్టార్ హోటళ్ల నిర్మాణానికి అనుమతి

పరిపాలనా ఆమోదం తెలిపిన మంత్రి మండలి



గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులకు అవసరమైన రూ.212.22 కోట్లు విడుదల చేసేందుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. అమరావతిలో నిర్మిస్తున్న గవర్నర్ నివాస సముదాయంలోని గవర్నర్ మాన్షన్, అసెంబ్లీ దర్బార్ హాల్, గవర్నర్ ఆఫీసు, అధికారులు, ఉద్యోగుల క్వార్టర్ల నిర్మాణానికి ఈ నిధులను వినియోగించనున్నారు. వీటికి సంబంధించి ఎంఈపీ మాత్రమే ఉండే ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో టెండర్లను పర్సంటేజ్ విధానంలో పిలవాలని నిర్ణయించారు. గవర్నర్ నివాస సముదాయ నిర్మాణం పరిపాలనా సామర్థ్యం, రాజ్యాంగ గౌరవాన్ని పెంచుతుందని మంత్రి మండలి అభిప్రాయపడింది. విజయవంతమైన బిడ్డర్లను ఆమోదించి, సంవత్సరం గడువులోపు సంబంధిత ప్రదేశాల్లో కన్వెన్షన్ సెంటర్ల అభివృద్ధికి ఒక్కొక్కరికి 2.5 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఏపీసీఆర్డీఏ కమిషనర్‌కు అధికారం ఇచ్చింది. ఈ క్రమంలో ఒప్పంద తేదీ నుంచి అవసరమైన అన్ని చర్యలు, పత్రాలు జారీ చేసేందుకు ఈ నెల 8న ఏపీసీఆర్డీఏ అథారిటీ చేసిన తీర్మానం నెం.589/2025కు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాజధానిలో నాలుగు స్టార్ హోటళ్ల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర పరిశ్రమల ప్రోత్సాహక బోర్డు(ఎస్‌ఐపీబీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు అమరావతిలో సదరన్ గ్లోబ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ సంస్థ 4 స్టార్ హోటల్స్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ రూ.176.96 కోట్లు పెట్టుబడి పెట్టనున్నది. 300 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. దీంతోపాటు దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కూడా అమరావతిలో 4 స్టార్ హోటల్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రూ.200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ హోటల్లో 400 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

కన్వెన్షన్ సెంటర్లకు టెండర్లు

క్వాలిటీ బేస్డ్ సెలక్షన్(క్యూబీఎస్) విధానం ద్వారా నాలుగు ప్రదేశాలలో(ప్రతి దానికి 2.5 ఎకరాలు) కన్వెన్షన్ సెంటర్ల ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. టెక్నికల్ ఎవాల్యుయేషన్ కమిటీ సిఫారసుల ఆధారంగా విజయవంతమైన బిడ్డర్లుగా లొకేషన్ 1లో జీ.వీ.హోటల్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, విజయ ఆగ్రో ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కన్సార్షియం, లొకేషన్ 2లో మహాలక్ష్మి ఇన్‌ఫ్రా వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, లొకేషన్ 3లో ఓంశ్రీభవనసాయి అసోసియేట్స్ ఎల్‌ఎల్‌పీ, లొకేషన్ 4లో వరుణ హాస్పిటాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌లను ఎంపిక చేశారు. ఈ కన్వెన్షన్ సెంటర్లు అమరావతిలో అంతర్జాతీయ సదుపాయాలను అందిస్తాయని మంత్రి మండలి ప్రకటించింది.



వాటర్ ట్యాంక్‌లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవి, మలేరియా ఆఫీసర్ రత్నాకర్

అంటువ్యాధులపై జాగ్రత్త

డీఎంహెచ్‌వో డాక్టర్ రవి సూచన

రెంటచింతల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, వైద్య సిబ్బందితో పాటు ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి సూచించారు. రెంటచింతలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రత్నాకర్‌తో కలిసి డీఎంహెచ్‌వో శుక్రవారం సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. వైద్యులు సమ్మెలో ఉండడం వల్ల ప్రత్యామ్నాయంగా చేసిన ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. రెంటచింతల గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పరంగా తీసుకోవాల్సిన చర్యలను వారు సూచించారు. వాటర్ ట్యాంక్‌లను, మంచినీటి ట్యాప్‌లను పరిశీలించారు. గోలి గ్రామానికి మంజూరైన ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వ పరంగా చర్యలు చేపడతామన్నారు. పీహెచ్‌సీ పరిధిలో జరుగుతున్న ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, ఎంపీహెచ్ఈవోలు శర్మ, ఆంజనేయులు, మలేరియా సూపర్‌వైజర్ సీహెచ్ అంకమరావు, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

సార్లొస్తున్నారు

- 13 నుంచి విధుల్లోకి ఉపాధ్యాయులు
- ప్రభుత్వ బడుల్లో తీరనున్న టీచర్ల కొరత
- మెగా డీఎస్సీ అభ్యర్థులకు ముగిసిన శిక్షణ
- నూతన ఉపాధ్యాయులకు పల్నాడు, గుంటూరు డీఈవోల దిశానిర్దేశం

గుంటూరు(విద్య), అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ముగిశాయి. దీంతో సోమవారం నుంచి ఆయా ఉపాధ్యాయులు విధులకు హాజరుకానున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పూర్తిస్థాయిలో తీరనున్నది. ఇప్పటివరకు ఉన్న ఉపాధ్యాయులనే సర్దుబాటుతో పాఠశాలలకు కేటాయించారు. దీంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ క్రమంలో 13 నుంచి నూతన ఉపాధ్యాయులు బడులకు రానుండటంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జోన్ 3 పరిధిలోని గుంటూరు ప్రకాశం నెల్లూరు ఉమ్మడి జిల్లాల పరిధిలో మొత్తం 1600 ఉపాధ్యాయ పోస్టులను ఇటీవల డీఎస్సీలో ప్రభుత్వం భర్తీ చేసింది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఫిజికల్ డైరెక్టర్ తదితర విభాగాల్లో దాదాపు 1200 మందికిపైగా ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఆయా క్యాడర్లలోని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఈ నెల 2 నుంచి నరసరావుపేట, బాపట్ల జిల్లాల్లోని కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించింది. ఈ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలను కేటాయించారు. వీరంతా ఆయా పాఠశాలల్లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఆయా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లతో పాటు ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత పూర్తిస్థాయిలో తీరనున్నదని ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు గుంటూరు, పల్నాడు జిల్లాల విద్యాశాఖాధికారులు రేణుక, చంద్రకళ శుక్రవారం దిశానిర్దేశం చేశారు. పేద విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

పోస్టింగ్‌ల్లో పల్నాడుకు ప్రాధాన్యం..

పల్నాడు జిల్లా పరిధిలోని బొల్లాపల్లి, మాచవరం, వెల్దుర్తి, మాచర్ల నియోజకవర్గాల్లోని మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయా ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు పట్టణ ప్రాంతాలకు వచ్చారు. దీంతో అనేక పాఠశాలలు ఉపాధ్యాయులు లేక వెలవెలబోతున్నాయి. ఈ నేపథ్యంలో డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయుల పోస్టింగ్‌లో పల్నాడు జిల్లాకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో జిల్లాలో ఇంతకాలం ఉపాధ్యాయులు లేని పాఠశాలలకు అత్యధికంగా పోస్టులు కేటాయించారు. దీంతో ఆయా పాఠశాలలు తిరిగి పూర్వ వైభవం సంతరించుకోనున్నాయి. మరోవైపు వచ్చే ఏడాది కూడా డీఎస్సీ నిర్వహించి భారీ సంఖ్యలో పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి నారా లోకేశ్ ఇప్పటికే ప్రకటించారు. దీంతో బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో ఉపాధ్యాయుల కొరత అంటూ ఉండే అవకాశం లేదని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

మధ్యాహ్న భోజనానికి

గుంటూరు బియ్యం

- ప్రత్యేకంగా ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం

6

మగవాళ్లకూ స్త్రీ శక్తి టిక్కెట్లు

- నలుగురు కండక్టర్ల సస్పెన్షన్

అటవీ భూముల రిజిస్ట్రేషన్ కేసులో..

ముగ్గురికి జైలు, జరిమానా

6

ఐటీఐలో 13న పీఎం నేషనల్ అప్రంటీస్ మేళా

తెనాలి అర్బన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): తెనాలి ఐటీఐలో ఈ నెల 13న పీఎం నేషనల్ అప్రంటీస్ మేళా జరుగుతుందని ప్రిన్సిపల్ ఆర్.చినవెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో 11 కంపెనీలు పాల్గొంటాయని, ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అన్ని రకాల ట్రేడ్‌లు చదివిన విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

జడ్పీకి రూ.22 కోట్లు ఆర్థిక సంఘం నిధులు

గుంటూరు సిటీ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు 15వ ఆర్థిక సంఘం నిధులు రానున్నాయి. 2025 - 2026 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా సుమారు రూ.22 కోట్లు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. టైడ్ కింద రూ.13.56 కోట్లు, అన్ టైడ్ కింద రూ.9.4 కోట్లు విడుదల కానున్నాయి. టైడ్ నిధులను గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, కాల్వ ల నిర్మాణం, అన్ టైడ్ నిధులు సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల ఏర్పాటు కోసం వినియోగిస్తారు.

ఖతార్‌లో నర్సు ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఖతార్‌లోని దోహాలో రిజిస్టర్ నర్సుల ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, సీఎన్ఎం నర్సింగ్ విద్యార్హతలు కలిగిన 21 నుంచి 40 ఏళ్లలోపు స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. రెండేళ్ల అనుభవంతో పాటు పోస్టు రిజిస్ట్రేషన్ ఉండాలని తెలిపారు. వారానికి ఆరు రోజులు, రోజుకు 12 గంటలు పని చేయాల్సి ఉంటుందని, భారత కరెన్సీలో నెలకు రూ.1.20 లక్షలు వేతనం చెల్లించ బడుతుంద తెలిపారు. దీనికి సంబంధించి ఈ నెల 13న ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ రెజ్యూమ్‌ను స్కిల్ ఇంటర్నేషనల్ ఎట్‌ది రేటాప్ ఏపీఎస్ఎస్ డీసీ.ఇన్ మెయిల్ ఐడీకి పంపించాలన్నారు. పూర్తి వివరాలకు 99888 53335, 87126 55686 నంబర్లకు సంప్రదించాలన్నారు.

ఈతతో మానసిక ఉల్లాసం

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరనాథ్
●ఉత్సాహంగా రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలు



పెద్ది రమణరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జస్టిస్ ఎన్.హరనాథ్



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు, జీడీసీసీ చైర్మన్ మక్కెన, విజేత రజనీకి గోల్డ్ మెడల్ అందిస్తున్న జస్టిస్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఈత ద్వారా మానసిక ఉల్లాసం, శ్వాస ప్రక్రియపై ఒత్తిడి తగ్గుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరనాథ్ పేర్కొన్నారు. ఏపీ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరులోని శ్యామలానగర్ లో రాష్ట్ర స్థాయి మాస్టర్ స్విమ్మింగ్ పోటీలు జరిగాయి. తొలుత పోటీలను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నగర తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్, ఏపీటీఎస్ చైర్మన్ మోహనకృష్ణ, రెరా డైరక్టర్ దామచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు పదేళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులను అభినందించారు. జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు పెద్ది రమణారావు, కార్యదర్శి ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ పోటీలకు అన్ని జిల్లాల నుంచి దాదాపు 150 క్రీడాకారులు హాజరైనట్లు వెల్లడించారు. ముగింపు కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరనాథ్ పాల్గొని విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ పోటీలలో మాస్టర్స్ పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ఏడుకొండలు, రాంబాబు నాయక్, సాంబశివరావు, అఖిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రతి అడుగు అభివృద్ధికి చిరునామా: చీఫ్ విప్ జీవీ

● ముఖ్యమంత్రిగా 15 ఏళ్ల విజయాలు అనితర సాధ్యం

వినుకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాధినేతగా చంద్రబాబు ప్రతి అడుగు అభివృద్ధి, ఆధునికత చిరునామా అని, ఆయన విజయాలు అనితర సాధ్యమని వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హృదయపూర్వక శుభా కాంక్షలు, అభినందనలు తెలిపారు. చంద్రబాబు రాజకీయ ప్రస్థానమే ఒక తరగని పాఠం అన్నారు. 1995లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టింది మొదలు 2004 వరకు 2014-2019 మధ్య, 2024లో మళ్లీ అధికారంలోకి వచ్చి, 15 ఏళ్లకు పైగా పాలన అందించారన్నారు. వీటిల్లో ఏ దశ చూ సినా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తుందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నేడు నవ్యాంధ్రలు గ్లోబల్ హబ్‌గా తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు దక్కించుకున్నాయన్నారు. 2020, 2047 ఇలా విజన్ ఏదైనా ప్రజల అభ్యున్నతే చంద్రబాబు లక్ష్యంగా పెట్టు కున్నారని జీవీ అన్నారు. 1999లోనే ప్రఖ్యాత టైమ్ మాగజీన్ నుంచి సౌత్ ఏషియన్ ఆఫ్ ది ఇయర్, 2017లో యూఎస్-ఇండియా బిజినెస్ కౌన్సిల్ నుంచి 'ట్రాన్స్‌ఫార్మేటివ్ చీఫ్ మినిస్టర్ అవార్డ్' ఆయన విజయాలకు సాక్ష్యంగా పేర్కొన్నారు.

కంభంపాడు కెనాల్ వద్ద ఆర్వోబీ నిర్మాణంపై పరిశీలన

రెంటచింతల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కంభంపాడు కెనాల్‌పై రోడ్డు ఓవర్ బ్రిడ్జిని నిర్మాణానికి ప్రతిపాదనలు, ట్రాక్‌పై రైలు వేగం పెంపుకోసం.. రైల్వే శాఖకు చెందిన రోడ్డు సేఫ్టీ ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్ నేతృత్వంలోని బృందం శుక్రవారం పాలువాయి గేట్ నుంచి రైల్వే ట్రాక్‌ను పరిశీలించింది. రైల్వే బోర్డు ఆదేశాల మేరకు అధికారులు కంభంపాడు కెనాల్, గన్నవరం ఎల్‌సీ(లెవల్ క్రాసింగ్)ను ఎత్తివేసి రోడ్డు ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. కంభంపాడు కెనాల్‌పైన పొడవు 700 మీటర్లు, వెడల్పు 28 మీటర్లు ఉంది. ఇక్కడ 36 మీటర్ల స్టీల్ గడ్డర్, ఆర్‌సీసీ టీ బీమ్‌లు 14 ఏర్పాటుకు డిజైన్ రూపొందించారు. ప్రస్తుతం ఉన్న ట్రాక్‌పై రైలు వేళ్లే వేగాన్ని 120 నుంచి 180 కిలోమీటర్లకు పెంచేలా చర్యలు చేపట్టనున్నారు. రోడ్డు ఓవర్ బ్రిడ్జికి సమాంతరంగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసి అన్నదాతలు పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకునేలా ప్రతిపాదనలు తయారు చేశారు. అలాగే ఆర్‌ఓబీ బ్రిడ్జిపై 25 పోల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ వెలుగులు ప్రసరించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ ఆర్‌ఓబీకి సుమారు ఆరు ఎకరాల స్థలం అవసరం ఉండగా ఈ మేరకు మార్కెట్ ధర చెల్లించనున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.58 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది. ఈ సర్వేలో రైల్వే అధికారులతో పాటు కన్సల్‌టెన్సీకి చెందిన సయ్యద్ చాంద్ బాషా, ప్రేమ్‌కుమార్, వంశీ తదితర సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.



పాలువాయిగేట్ రైల్వే ట్రాక్ మ్యాప్ పరిశీలిస్తున్న బృందం

లిక్కర్ కింగ్ మిథున్‌రెడ్డి లేఖ హాస్యాస్పదం

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల



పొన్నూరు, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): లిక్కర్ కింగ్ మిథున్ రెడ్డి లిక్కర్ మాఫియా మీద లేఖ రాయడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ శుక్రవారం పేర్కొన్నారు. మిథున్ రెడ్డి లేఖ దొంగే దొంగ అని అరిచినట్లుందని ఎద్దేవ చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌ను తలదన్నిన స్కాం ఆంధ్రాలో వైసీపీ లిక్కర్ స్కాం అన్నారు. దేశం దృష్టిని ఆకర్షించిన రూ. 3,500 కోట్ల భారీ లిక్కర్ స్కాంలో నిందితుడిగా మిథున్ రెడ్డి ఉన్నారన్నారు. కల్తీ మద్యానికి ఆద్యం పోసింది వైసీపీ ఘనులే నని దుయ్యబట్టారు. పేదల ఆరోగ్యం బలి తీసుకొని సంపదను తమ కంపెనీలకు మళ్లించిన ఘనులు లేఖలు రాయడం దెయ్యాలు వేదాలు వల్లించడమేనని ఎద్దేవ చేశారు. వైసీపీ హయాంలో జంగారెడ్డిగూడెం విష మద్యం ఘటనలో 16 మంది మృతి చెందితే కనీసం పరామర్శించని వైసీపీ నాయకులు.. నేడు చిలక పలుకులు పలుకుతున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి అనుయాయుల ధనదాహానికి వేలాది మంది పేద కుటుంబాలు సమిధులు అయ్యారన్నారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన కోట్ల లిక్కర్ స్కాంపై మిథున్‌రెడ్డి సీబీఐ దర్యాప్తు కోరుతూ ఉత్తరం రాయాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌కు వరద నీరు వస్తుండడంతో ప్రాజెక్ట్ అధికారులు శుక్రవారం 4 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాగా సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7353, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,495, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 32,400, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 83,888 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 83,888 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



4 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచిం తల ప్రాజెక్టులో శుక్రవారం 43.74 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 79,040 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, రెండు గేట్ల ద్వారా 65,499, మొత్తం 82,499 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

దిగువకు 43,500 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండ డంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు తోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 61,046 క్యూసెక్కుల వరద నీరు శుక్ర వారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 43,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 10,339, పశ్చిమ డెల్టాకు 7,026, గుంటూరు చానల్‌కు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉపాధికి ఇక పక్కా హామీ

(5వ పేజీ తరువాయి)

ఆలోగా మొత్తం ప్రక్రియను ఓ కొలిక్కి తేవడానికి డ్వామా విభాగం కసరత్తు చేస్తోంది.

నేరుగా యాప్‌లో నమోదు

నరేగా యాప్‌లోనే ఈ కేవైసీ ఆప్షన్‌ను ప్రభుత్వం ఇచ్చింది. దీని ప్రకారం ఉపాధి హామీ పనుల్లో ప్రస్తుతం యాక్టివ్‌గా ఉంటున్న ప్రతి శ్రామికుడి వద్దకు ఫీల్డ్ అసిస్టెంట్ వెళ్లి జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు వివరాలు నమోదు చేయడంతో పాటు ఈ కేవైసీ అంకాన్ని కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. దీని ఆధారంగా ఇకపై పని ప్రదేశంలో శ్రామికుల హాజరు పక్కాగా ఉండడంతో పాటు బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట పడనుంది. ఇక మీదట పనివేళల్లో రోజుకు రెండుసార్లు ఫేస్ బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు తీసుకోనున్నారు. ఒకరికి బదులుగా వేరొకరు హాజరు వేసే ప్రయత్నం చేస్తే ఈ కేవైసీ అమలవుతుండడం వల్ల వెంటనే బయటపడనుంది. దీంతో వారికి ఇచ్చే వేతనాన్ని కూడా నిలుపుదల చేయనున్నారు.

పాత విధానంలో అనేక అక్రమాలు

ఉపాధి హామీ శ్రామికుల హాజరు విధానంలో ఉన్న లొసుగులు లోపభూయిష్టంగా ఉండడంతో ప్రభుత్వాలు ఎన్ని చర్యలు తీసుకున్నా ఏళ్ల తరబడి ఈ మస్టర్ల మాయాజాలం నడుస్తూనే ఉంది. యాప్‌లో గ్రూప్ ఫొటో అప్‌లోడ్ చేయడం వరకే పరిమితమయ్యేది. సంతకాన్ని కూడా ప్రామాణికంగా తీసుకునే వారు. దీంతో మస్టర్ల విషయంలో అనేక ఆరోపణలు వెలుగుచూసేవి. ఉదయం హాజరు వేయించుకుని పని ప్రదేశం నుంచి వెళ్లిపోవడం మొదలుకుని, అర్హత లేని వారికి కూడా రాజకీయ సిఫారసులతో జాబ్ కార్డులు ఇప్పించుకుని ప్రభుత్వ నిధులను పెద్ద ఎత్తున పక్కదారి పట్టించేవారు. నవంబరు నుంచి అమలవబోతున్న నూతన విధానంలో రోజుకు రెండు సార్లు ముఖ హాజరును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో మస్టర్ల విషయంలో ఇకపై ఎలాంటి అక్రమాలకు తావుండదని, అర్హతే ప్రామాణికంగా జాబ్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు పనిచేసిన వారికే వేతనం పక్కాగా అమలు కానుందని అధికారులు చెబుతున్నారు.

ఆంజనేయస్వామి ఆభరణాలు మాయం

యడ్లపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యడ్లపాడులోని శ్రీప్రపత్తి ఆంజనేయస్వామికి భక్తులు సమర్పించిన ఆభరణాలను కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ ఆలయం బాధ్యతలను సంఘ సభ్యులే పర్యవేక్షిస్తుంటారు. 2016 నుంచి ఆలయ నిర్వహణ బాధ్యతలను చూస్తున్న.. సంఘం ఉపకోశాధికారి మద్దుల రమణారావు చూస్తున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అమ్మవారి అలంకరణకు అవసరమైన నగలను ఇవ్వాలని ఆర్యవైశ్యులు రమణారావును కోరారు. ఈ క్రమంలో రమణారావు భార్యాపిల్లలతోపాటు సంఘ భవనం, స్వామివారి ఆభరణాలు దాచి ఉంచిన బీరువా తాళాలు తీసుకుని గ్రామం విడిచి వెళ్లిపోయాడు. దీంతో సభ్యులంతా కలసి నూతన కమిటీని ఎన్నుకుని గ్రామ పెద్దల సమక్షంలో సంఘ భవనం తాళాలను తెరిచి గదులను పరిశీలించారు. స్వామివారి ఆభరణాలు దాచిన బీరువాను తెరిచి చూడగా స్వామివారి ఆభరణాలు కనిపించలేదు. ఇన్నేళ్లుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టిన రమణారావే స్వామి వారి ఆభరణాలను మాయం చేశాడని నిర్ధారించుకుని.. శుక్రవారం సంఘ సభ్యుడు పోతుగంటి పవన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భక్తులు స్వామివారికి సమర్పించిన బంగారు, వెండి ఆభరణాల విలువ సుమారు రూ.8లక్షలకు పైగా ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తను అధ్యక్షుడిగా నూతన కమిటీని ఏర్పాటు చేసి, ఆర్యవైశ్య సంఘ భవనాన్ని తన భార్య పేరుతో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుని.. బ్యాంకు రుణం పొందడానికి రమణారావు గతంలో యత్నించారు. దీంతో సంఘ సభ్యులు పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ కొనసాగుతోంది.

రోడ్డు ప్రమాదంలో తాపీ మేస్త్రి మృతి

దాచేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో.. తాపీ మేస్త్రీ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని శ్రీనగర్ సమీపంలోని సిమెంట్ ఫ్యాక్టరీ వద్ద జరిగింది. మృతుడు ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వల్లాపల్లికి చెందిన ముట్లూరి అంజయ్య(35)గా గుర్తించారు. అంజయ్య తెలంగాణలోని భువనగిరిలో తాపీ పని చేస్తూ.. శుక్రవారం రాత్రి భార్యబిడ్డల వద్దకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. అతని తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అటవీ భూముల రిజిస్ట్రేషన్ కేసులో..

ముగ్గురికి జైలు, జరిమానా

వినుకొండటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండలం పేరూరుపాడు అటవీ భూములు అక్రమ రిజిస్ట్రేషన్ చేసి పాస్ పుస్తకాలు తీసుకున్న ఘటనపై వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు శిక్షలు ఖరారు చేసినట్లు బొల్లాపల్లి ఎస్ఐ బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి బ్యాంకులో రుణాలు పొందడంపై వినుకొండ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అప్పటి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ ముగ్గురికి లక్ష రూపాయలు జరిమానా విధించి.. మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

హలో.. నేను పోలీస్ అండి..

డబ్బులు ఫోన్ పే చేయండి!

కారంపూడి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కారంపూడిలో కొత్త రకం మోసం శుక్రవారం వెలుగుచూసింది. నెల రోజుల క్రితం జరిగిన ఆన్‌లైన్ మోసం మరువక ముందే రెండో మోసానికి దుండగులు తెరలేపారు. శుక్రవారం చెక్‌పోస్టు సెంటర్లో మూసి ఉన్న దుకాణాదారునికి ఓ వ్యక్తి ఫోన్ చేసి..'ఈ రోజు నా కుమార్తె పుట్టిన రోజు.. నేను నా మొబైల్ నుంచి గూగుల్‌పే ద్వారా డబ్బు పంపలేకపోతున్నాను.. మీరు నాకు సాయం చేయండి.. నేను మీకు గూగుల్‌పే ద్వారా డబ్బు పంపిస్తాను.. మీరు ఫోన్‌పేలో పంపండి.' అని చెప్పాడు. సదరు దుకాణం యజమాని ఇది నమ్మి డబ్బు పంపించాడు. నెల రోజుల క్రితం ఎస్‌బీఐ బ్యాంకు సెంటర్లో ఒక నెట్ సెంటర్ వ్యక్తికి ఫోన్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను ఏఎస్‌ఐని మాట్లాడుతున్నానని కానిస్టేబుల్‌కు యాక్సిడెంట్ జరిగింది.. పిడుగురాళ్ల వైద్యం చేస్తున్నామని.. అర్జెంట్‌గా డబ్బులు కావాలి అంటూ రూ. 65 వేలను ఫోన్‌పే చేయించుకొన్నాడు. ఇలాంటి ఘటనలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఇంటర్నెట్, మొబైల్ ఆధారిత మోసాలు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వాసు హెచ్చరించారు. పోలీసు అంటూ ఫోన్ కాల్ చేసిన వారికి డబ్బు పంపి మోసపోవద్దని సూచించారు.

జంట హత్య కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, అక్టోబర్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సంచలనం సృష్టించిన తండ్రికొడుకుల కిడ్నాప్, హత్య కేసులో నిందితులైన బెంగళూరుకు చెందిన నారాయణస్వామి, శ్రీధర్‌ను కడియాల వైద్యశాల వద్ద శుక్రవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు మొదటి పట్టణ సీఐ చరణ్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు చెప్పారు. దీంతో ఈ కేసుతో సంబంధం ఉన్న మొత్తం 13 మంది నిందితులను అరెస్టు చేశామని వెల్లడించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

41,281 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 42,595 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 41,281 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 11,715 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	14500	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14000	334	10500	15200
273	10500	12500	నెంబరు. 5	10000	14200
341	10000	15200	341	10000	15500
4884	---	---	4884	10000	14500
సూపర్ 10	---	----	సూపర్ 10	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15200	తేజ	10000	15200
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15500	దేవనూరు డీలక్స్	10500	14500
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	7700

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి ప్రకృతి వ్యవసాయం

దాచేపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి వేసి ప్రకృతి వ్యవసాయాన్ని జీవనంగా స్వీకరించిన రవికుమార్ ఆదర్శ రైతు అని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అభినందించారు. శుక్రవారం మండలంలోని గామాల పాడులో గరికపాటి రవికుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి ఎకరం పొలంలో కూరగాయల సాగు చేపట్టాడు. ఏ గ్రేడు మోడల్ ప్రకృతి వ్యవసాయపొలాన్ని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి, ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ సత్యగోపాల్, ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, ఏవో వెంకటేష్, భూసార పరీక్షా కేంద్ర వ్యవసాయాధికారి యాకూబ్‌లు పరిశీలించారు.

సంక్షిప్తం...

● మాచవరం: మండలంలోని మోర్జంపాడు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఆర్య వైశ్య అఫిషియల్స్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు కపిలవాయి లక్ష్మీదేవమ్మ జ్ఞాపకార్థం భర్త నరసింహారావు, కుమార్తె సంధ్యారాణి వంద ప్లేట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా ఎంఈవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి, ఎస్ శ్రీనివాసరావు, బాలసైదారావు, సాంబశివరావు, రంగారావు, హెచ్‌ఎం రామిరెడ్డి పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల: స్థానిక జడ్పీ హైస్కూల్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు సుమారు రూ.లక్ష విలువైన క్రీడా పరికరాలను హెచ్‌ఎం కొత్త మల్లిఖార్జునరావుకు అందజేశారు.

● దాచేపల్లి: దాచేపల్లి నగర పంచాయతీలోని దుర్గా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం అండర్ - 14, 17 పోటీల్లో ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, అథ్లెటిక్స్‌లో మొదటి, రెండో స్థానాల్లో 46 మంది విజేతలుగా నిలిచారు. దాచేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు అండర్-17లో కబడ్డీలో మొదటి స్థానంలో నిలిచారు.

● సత్తెనపల్లి: ఓటర్ల జాబితా అవకతవకలపై శుక్రవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ చుక్కా చంద్రపాల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జ్ఞానరాజ్‌పాల్, నాయకులు పాల్గొన్నారు.

● రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు సత్తెనపల్లి ప్రాంత ఉపాధ్యాయసంఘాల నేతలు ఎంఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సుభానీ, శ్రీనివాసరావు, బాబు, విష్ణు, తాజుద్దీన్, రాజు, ఇబ్రహీం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ: వీధి కుక్కలు వెంబడించడంతో స్కూటీపై వెళ్తున్న ఇరువురు ఉపాధ్యాయులు గాయాలపాలైన సంఘటన బెల్లంకొండ సచివాలయం వద్ద శుక్రవారం జరిగింది. ఈ సంఘటనలో ఉపాధ్యాయులైన సుబ్బారావు, శివపార్వతి బెల్లంకొండ నుంచి చంద్రాజుపాలెం పాఠశాలకు వెళ్తుండగా బెల్లంకొండ సచివాలయం వద్ద వీధికుక్కలు ఎగబడటంతో స్కూటీపై నుంచి కిందపడ్డారు. సుబ్బారావుకు స్వల్ప గాయాలయ్యాయి. శివపార్వతికి తలకు తీవ్ర గాయమైంది. గుంటూరు ప్రభుత్వవైద్యశాలకు తరలించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

● క్రోసూరు: బళ్ళారి రాఘవ కళా సమితి అధ్యక్షుడు బొబ్బిళ్ళపాటి గోపాలకృష్ణ సాయికి తెలంగాణాకు చెందిన సంగమం సంస్థ జీవన సాఫల్య పుస్కారానికి ఎంపిక చేసింది. సామాజిక, సాంస్కృతిక, ప్రజాసేవ, రాజకీయరంగంలో ఆయన సేవలకు ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 15వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో అందుకోనున్నారు.

● పెదకూరపాడు: గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలని సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ విద్య అన్నారు. పెదకూరపాడులోని ప్రభుత్వవైద్యశాలలో శుక్రవారం మాగులూరి ఫౌండేషన్ సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీచేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు, కొండవీటి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి: అమరావతిలోని రెండు బాణసంచా గోడౌన్‌లను తహసీల్దార్ డానియేలు, సీఐ అచ్చియ్య, ఎస్ఐ రాజశేఖర్ తమ సిబ్బందితో పరిశీలించారు.దీపావళి రోజున అనుమతులు లేకుండా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

● మాచర్ల: మాచర్లకి చెందిన ఎన్‌ఆర్‌ఐ కృష్ణప్రసాద్ స్నేహితులు ద్వారా ఆయన మనుమడు వియాన్ శేఖర్ పుట్టిన రోజు సందర్భంగా మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేపీ చారి, రమేష్, ఉప్పు ప్రసాద్, చంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, వాసు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● విజయపురిసౌత్: బాల్యవివాహాలను అరికట్టాలని మాచర్ల మండలం కొప్పునూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం నాగమణి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బందితో కలిసి పాఠశాలలో బాలికలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకరికల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఏఈఈ సుచరిత తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు వివరించారు.

● అచ్చంపేట: అచ్చంపేట విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

● పెదకూరపాడు: మండలంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ కోత విధిస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దాసరి రామకృష్ణ తెలిపారు.

● అమరావతి: 33కెవి విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 3వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అధికారి రవికిరణ్ తెలిపారు.

● గురజాలటౌన్: గురజాల, జంగమహేశ్వరపాడు, మాడుగుల, చర్లగుడిపాడు, దైద, పులిపాడు సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ప్రసాద్ తెలిపారు.

● కారంపూడి: నరమాలపాడు, మిరియాల సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8నుంచి సాయంత్రం 4వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రసాద్ తెలిపారు.

● రెంటచింతల: రెంటచింతల, పాలువాయి, జెట్టిపాలెం, మంచికల్లు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మస్తాన్‌వలి చెప్పారు.

భూముల ఆక్రమణకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలం కోనూరులో నకిలీపత్రాలతో భూములను స్వాధీనం చేసుకోవాలని యత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అచ్చంపేట మండలం, కోనూరు గ్రామ ఎస్సీకాలనీవాసులు వేమవరపు కృష్ణ, కోనూరు ది ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ సభ్యులు శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదుచేశారు. తమ పూర్వీకుల ద్వారా 1923లో కోనూరు ది ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ నెం.305 ద్వారా రిజిష్టర్ చేయించుకున్నామన్నారు. కోనూరుకి చెందిన శాఖమూరి శ్రీనివాసరావు తమ భూములకు నకిలీపత్రాలు పుట్టించాడన్నారు. వాటిని రద్దుచేసి భూముల ఆక్రమణకు యత్నిస్తున్నవారిపై అట్రాసిటీ కేసు నమోదుచేసి, తమకు పాసుపుస్తకాలు ఇప్పించాలని కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. పరిశీలించి న్యాయం చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

నల్ల బర్లీ పొగాకు సాగు నిషేధం: ఏవో

కారంపూడి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నల్ల బర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని ఏవో నరసింహారావు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, ప్రభుత్వ టాస్క్‌ఫోర్స్ కమిటి ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెల్లబర్లీ పొగాకు సాగుచేసే రైతులు ఆయా కంపెనీల నుండి అగ్రిమెంట్ బాండ్లు పొందాలన్నారు. కౌలుకార్డులను గ్రామాల్లో రెవెన్యూ అధికారులు అందజేస్తున్నారన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చేయూత

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గానికి చెందిన 11మందికి రూ.7,06,829 సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు.



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

జీఎస్టీతో ప్రజల తలసరి ఆదాయం మెరుగు

జీఎస్టీతో ప్రజల తలసరి ఆదాయం మెరుగు పడుతుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో శుక్రవారం ఎలక్ట్రానిక్ పరికరాలు, వాహనాల ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రతి కుటుంబానికి నెలకు రూ.5వేల వరకు ఆదా అవుతుందన్నారు. జీఎస్టీ తగ్గింపుపై వినియోగదారులకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీదేవి, ఎలినేడి రామస్వామి, దరువూరి నాగేశ్వరరావు, మస్తాన్‌వలి, చౌట శ్రీనివాసరావు, బావన్నారాయణ, బండారు నాగరాజు, నూర్‌బాషా జాన్‌బాబు, బత్తుల నాగేశ్వరరావు, అంచుల నరసింహారావు, ఆళ్ళ అమరేశ్వరరావు, నానయ్య, కట్టా శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరుతూ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సమైక్య నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కన్నాను కలసి వినతిపత్రం అందించారు. దీనిపై ఎమ్మెల్యే కన్నా సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందించిన వారిలో చిలుకా ప్రదీప్, గౌతమి, నళిని, అరుణ, రవిరాజు, సురేష్, నాగలక్ష్మి, నరసింహా, అనంతు, వెంకటేష్, నందిని, వెంకట్, నారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక

ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఆయా సమస్యలపై ఆయన వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.



విద్యార్థులను అభినందిస్తున్న గీతిక సీబీఎస్ఈ స్కూల్ ఛైర్మన్ బాలగంగాధరరెడ్డి, సిబ్బంది

రాష్ట్రస్థాయి క్రీడలకు గీతిక విద్యార్థుల ఎంపిక

పిడుగురాళ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): గీతిక సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పిట్టు క్రీడాపోటీలకు ఎంపికవడం సంతోషమని పాఠశాల ఛైర్మన్ తాళ్లపల్లి బాలగంగాధరరెడ్డి శుక్రవారం తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో జిల్లాస్థాయి పిట్టు క్రీడాపోటీలలో గీతిక సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులు జీనీఫ్, తేజశ్విన్, గోపి, చరణ్‌లు ప్రతిభచూపి శని, ఆదివారాల్లో తిరుపతి జిల్లా చంద్రగిరి జడ్పీ హైస్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు కొంత సమయం క్రీడలకు కేటాయించాలన్నారు. ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వైస్‌ఛైర్మన్ తాళ్లపల్లి పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాలలో అభివృద్ధి పరచడమే గీతిక సీబీఎస్ఈ స్కూల్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ తాళ్లపల్లి వెంకట్రామిరెడ్డి, పీఈటీ ఎం.అజయ్ పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వ ప్రోత్సాహకాలు

● ఉద్యానశాఖ అధికారి అంజలీబాయి

మాచవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న రైతు లు ఆయా గ్రామాల రైతుసేవా కేంద్రాల్లో పంట నమోదుచేయించుకోవాలని, అలా చేయించుకున్న వారికే ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుతాయని ఉద్యానశాఖ అధికారి ఎం అంజలీబాయి తెలిపా రు. శుక్రవారం మండలంలోని పిల్లుట్ల, మల్లవోలు గ్రామంలో సూపర్ చెక్ కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పంటలను పరిశీలించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ అరటి, బొప్పాయి, మిరప, కూరగాయల తోటల్లో నీరు నిల్వ ఉండకుండా కాలువలు చేసుకొని బయటకు పంపాలన్నారు. నీరు నిలిస్తే వేరుకుళ్ళు తెగుళ్ళు వస్తాయన్నారు.కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు హనుమంత్ నాయక్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మల్లవోలులో రైతులకు సూచనలిస్తున్న ఉద్యాన అధికారి అంజలీబాయి

మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా రాధాకృష్ణ



పాశం రాధాకృష్ణ

మాచవరం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మాచవరం మండలం టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా మోర్జంపాడు గ్రామానికి చెందిన పాశం రాధాకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో రాధాకృష్ణ గ్రామ పార్టీ అధ్యక్షుడిగా పని చేశారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, రాధాకృష్ణను మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ తనను ఎంపిక చేసినందుకు ఎమ్మెల్యే యరపతినేనికి, మండల టీడీపీ నాయకులకు, గ్రామ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల తనిఖీ

మాచర్ల రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ పరిధిలో శుక్రవారం ఆపరేషన్ విభాగ పర్యవేక్షక ఇంజనీర్ డాక్టర్ పి.విజయ్‌కుమార్ ఆధ్వర్యాన విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. 45 మంది అధికారులు, 135మంది సిబ్బంది బృందాలుగా ఏర్పడి 4311 సర్వీసులు తనిఖీ చేసినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ఏ కరీమ్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ సింగయ్య తెలిపారు. విద్యుత్ చౌర్యం, అక్రమవాడకందారులకు మొత్తం రూ.3.89లక్షల అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను సెల్ 94408 12263, 86397 41050లకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ విభాగ డీపీఈ రామయ్య, డీపీఈ (విజిలెన్స్) డీఈఈలు కె.రవికుమార్, ఎస్ శ్రీనివాసరావు, ఏఈఈలు కె.కోటేశ్వరరావు, ఎం సతీష్‌కుమార్, యు.శివశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థినులు మానసిక దృఢత్వాన్ని అలవర్చుకోవాలి

మాచర్ల: మాట్లాడుతున్న ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్



మాచర్ల రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు పీహెచ్‌సీలో శుక్రవారం ప్రపంచ మానసిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్‌కళ్యాణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానసికంగా బలంగా ఉన్నప్పుడే శారీరక ఆరోగ్యం కూడా సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రభుత్వ న్యాయవాది జి.వెంకటేశ్వర్లు, మాచర్ల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై రమేష్‌బాబు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

● క్రోసూరు: విద్యార్థినులు అన్ని పరిస్థితులను ఎదుర్కొనేందుకు మానసిక దృఢత్వాన్ని అలవర్చుకోవాలని ప్రముఖ సైకాలజిస్టు ఎం.చందన అన్నారు. క్రోసూరులోని కేజీబీవీలో జరిగిన మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినులు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కమ్యూనికేషన్, టెక్నాలజీపై పూర్తి అవగాహన కలిగివుండాలన్నారు. ప్రిన్సిపల్ ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థినుల సందేహాలకు చందన సమాధానాలు ఇచ్చారు.

● వెల్దుర్తి: మండలంలోని శిరిగిరిపాడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. జిల్లా కెరీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఖాదర్‌షాహుసేన్ విద్యార్థినులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ప్రతి మనిషికి శారీరక, మానసిక ఆరోగ్యం రెండూ ముఖ్యమేనన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● దుర్గి: దుర్గిలోని ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ జీవితంలో విజయం సాధించాలంటే మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ రెహ్మాన్ అన్నారు. అనంతరం విద్యార్థులచే యోగా చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల: రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలమేరకు పిడుగురాళ్ల మండల న్యాయ సేవాధికారసంస్థ ఛైర్‌పర్సన్ టి.ప్రవళిక ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు మందులు పంపిణీ చేశారు. స్థానిక నిమ్మతోటలోగల సూర్యకిరణ్ మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె కుమారస్వామి, న్యాయవాదులు రమేష్, ప్రశాంత్‌కుమార్ నాయక్, ఎస్‌వీ కోటేశ్వరరావు, అయాజ్‌అహ్మద్, ఎం.శ్రీనివాసరావు, పి.నవ్య, నాగార్జున, కోర్టు, పోలీసు సిబ్బంది గోపీకృష్ణ, ఎం పద్మ, ఏఎన్‌ఎం జయలక్ష్మీ, ప్రిన్సిపాల్ వెంకటరవీంద్రప్రసాద్, షేక్ అబ్దుల్ సమీర్ పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: పట్టణంలోని పరివర్తన పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయవాదులు మానసిక దివ్యాంగులకు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో దివ్వెల శ్రీనివాసరావు, కిషోర్, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో కుటుంబాలకు మేలు



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, వ్యాపారులు

పిడుగురాళ్ల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల వాణిజ్యపన్నులశాఖ ఆధ్వర్యంలో జానపాడు రోడ్డులోని శుభమస్తు కల్యాణ మండపంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిడుగురాళ్ల వాణిజ్యపన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.నారాయణశాస్త్రి ఎలక్ట్రానిక్ పరికరాలపై జీఎస్టీ తగ్గుదల గురించి వివరించారు. జాయింట్ కమిషనర్ (రెండో డివిజన్) పి.జాన్‌స్టీవెన్‌సన్, అసిస్టెంట్ కమిషనర్ పీవీ రంగయ్య, వ్యాపారులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

మాచవరం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మాచవరం గ్రామ సచివాలయంలో శుక్రవారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో విష్ణు చిరంజీవి, పిడుగురాళ్ళ కమర్షియల్ ట్యాక్స్ అధికారి శ్రీసాయి గోపీనాథ్‌లు ముఖ్య అతిథులుగా హాజరై సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు రకాల ఎలక్ట్రానిక్ వస్తువులకు రేట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాగిడి నరేష్, పుసులూరి రామయ్య, పీఎస్ కోటేశ్వరరావు, ఏపీవో కోటిరెడ్డి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0పై ...

పెదకూరపాడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు నిర్వహించారు. కరపత్రాలతో ప్రజలకు, వ్యాపారులకు, రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని లగడపాడు, కస్నెగండ్ల, గారపాడు గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల మాజీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వడ్లమూడి అప్పారావు, గల్లా బాబూరావు, మండల టీడీపీ నేతలు మద్దినేని వెంకట సత్యనారాయణ, మక్కెన సాగర్, షేక్ ముంతాజ్, నరిపూడి కృష్ణకుమారి, ఏటుకూరి అరవింద్, పెనుముచ్చు రమేష్, మేడా కోటేశ్వరరావు, పొదిలి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వస్తువుల ధర తగ్గుముఖం

రెంటచింతల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో అన్ని వస్తువుల ధరలు తగ్గాయని వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జీఎస్టీ ఏఈవో పుల్లారావు కోరారు. శుక్రవారం రెంటచింతలలో ధరలు తగ్గిన వస్తువులతో స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మేరీ కనకం, ఎంఈవో 2 శివనాగేశ్వరావు, సురేష్, వెలుగు, పీహెచ్‌సీ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఆరోగ్యానికి పోషకాహారం అవసరం



మాట్లాడుతున్న సర్పంచ్ గుడిపూడి రాజు

పెదకూరపాడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డ ఆరోగ్యానికి పోషకాహారం అవసరమని తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, ఎంపీడీవో సాయి లీల అన్నారు. పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల సందర్భంగా మండల స్థాయిలో గర్భిణులకు పసుపు, కుంకుమలు, చీరలు, గాజులు, పూలు, పండ్లు అందించి సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, ఎమ్మెల్యే భాష్య ప్రవీణ్ అత్తయ్య నంబూరి దేవి పాల్గొని పోషకాహార విలువల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి షేక్ ముంతాజ్, మండల తెలుగు మహిళా నేత కాపూరి సుజాతలు సీమంతానికి, సన్మానానికి అవసరమైన చీరలు, దుశ్శాలువాలు, జామ మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, సత్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో వెంకటరమణ, హెచ్‌ఎం కాకాణి వెంకటరమణ, మహిళా పోలీసులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషకాహార స్టాల్‌ను అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటుచేశారు.

దూర విద్యతో ఉన్నత విద్యావంతులుగా మారవచ్చు..



మాట్లాడుతున్న క్రోసూరు ఎంపీడీవో రవి కుమార్

క్రోసూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): దూర విద్యావిధానం ద్వారా ఉన్నత విద్యావంతులు కావచ్చని ఎంపీడీవో జీ రవి కుమార్ అన్నారు. శుక్రవారం క్రోసూరు హైస్కూల్‌లో దూర విద్యా విధానానికి సంబంధించి ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవోలు జీ కృష్ణ, ఎం గణేష్ మాట్లాడుతూ రెగ్యులర్ విద్యా విధానానికి సమానంగా దూర విద్య ద్వారా లభించే సర్టిఫికెట్లు పనికి వస్తాయన్నారు. మండల సమన్వయ కర్త సీహెచ్ సురేష్ మాట్లాడుతూ దూర విద్యావిధానం చదువు మానివేసిన వారికి వరప్రసాదిని వంటిదన్నారు. కార్యక్రమంలో విషయ నిపుణుడు ఇన్నారెడ్డి, హెచ్‌ఎంలు దుగ్గి బాబూరావు, లక్ష్మీనారాయణ, డానియేలు తదితరులు పలు సూచనలు చేశారు.

కండ్లకుంట ఫీల్డ్ అసిస్టెంట్ విధుల నుంచి తాత్కాలికంగా తొలగింపు

నకరికల్లు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కండ్లకుంట ఫీల్డ్ అసిస్టెంట్ ఎం విశ్వేశ్వరరావును తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు డ్వామా పీడీ ఎం సిద్దలింగమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వేశ్వరరావుపై కండ్లకుంట ప్రజలు ఫిర్యాదు చేశారు. ఉపాధి శ్రామికులకు తక్కువ పని దినాలు నమోదు చేయటం, పని చేయని వారికి వేతనాలు జమచేయటం వంటి చర్యలకు పాల్పడ్డట్టు సత్తెనపల్లి క్లస్టర్ ఏపీడీ పీ వెంకటనారాయణ విచారణ జరిపి నివేదికను డ్వామా పీడీకి అందజేశారు. యంత్రాలతో పనులు చేసినట్టు తెలియజేయటంతో విశ్వేశ్వరరావుపై అధికారులు చర్యలు చేపట్టారు. వారం రోజుల్లోగా అభియోగాలపై సంజాయిషీ ఇవ్వాలని, లేదంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జగన్ హయాంలోనే ప్రైవేట్‌కు 50శాతం మెడికల్ సీట్లు



ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): 50శాతం మెడికల్ సీట్లు ప్రైవేట్‌కు కేటాయించింది జగన్ హయాంలోనేనని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ మెడికల్ కళాశాలలపై రాష్ట్ర ప్రజలను పక్కదారి పట్టిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్న జగన్ బుద్ధి మరోసారి బట్టబయలైందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రైవేట్ కోటాకు 50 శాతం సీట్లు కేటాయిస్తూ జీవో నెం.107, 108, 133ను జగన్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. పీపీపీ విధానంలో ప్రభుత్వ కోటాలో 110 సీట్లు అదనంగా పెరుగుతాయనేది వాస్తవమని, ఈ విధానం వల్ల రాష్ట్ర విద్యార్థులకు మరింత అవకాశం లభిస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం గురించి పట్టించుకోని జగన్ స్వార్థ రాజకీయాల కోసం దుష్ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని ఎమ్మెల్యే హెచ్చరించారు.



అచ్చంపేటలో సీమంతాల్లో పాల్గొన్న అధికారులు, నాయకులు

పౌష్టికాహారంతో ఆరోగ్యం: ఎంపీపీ

అచ్చంపేట, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పాలు, గుడ్లు వంటి పౌష్టికాహారం తీసుకుని గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరంగా ఉండాలని ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ అన్నారు. శుక్రవారం అచ్చంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అచ్చంపేట, పెదపాలెం సెక్టార్ల ఐసీడీఎస్ సంయుక్తంగా కార్యక్రమం జరిగింది. మండలస్థాయిలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారంతో మహిళలకు రక్తహీనత లేకుండా ఉంటుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని, పిల్లలకు కూడా పరిసరాలపై అవగాహన కల్పించాలన్నారు. బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమేకల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషకాహారాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 8మంది స్త్రీలకు సీమంతం నిర్వహించారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవంలో భాగంగా జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, వేగుంట రాణి, రాయిడి సాంబశివుడు, అనూపకళ, ప్రిన్సిపల్ ప్రసాదు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, మాణిక్యం పాల్గొన్నారు.

గౌస్ మృతి టీడీపీకి తీరని లోటు



గౌస్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కొమ్మాలపాటి

పెదకూరపాడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత గౌస్ అకాలమృతి పార్టీకి, కుటుంబానికి తీరని లోటని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. పెదకూరపాడుకు చెందిన టీడీపీ మండల నాయకులు షేక్ బైలర్ గౌస్ మృతదేహాన్ని శుక్రవారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. టీడీపీ మండల నేతలు అర్తిమళ్ళ రమేష్, భాష్యం ఆంజనేయులు, సర్పంచ్ గుడిపూడి రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వఅప్పారావు, బి.రామగోపాలరావు, జి.బాబూరావు, ఎం.నరసింహారావు, ఏ అరవింద్, పి.యోహాన్ పాల్గొన్నారు.

లింగాపురంలో పలువురికి పరామర్శ...

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ టీడీపీ నాయకులు పి కోటేశ్వరరావు, ఎస్ వెంకట్రావు, జి.శివాజీ, బుచ్చియ్యలను జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు.టీడీపీ నాయకులు కె.వసంతరావు, ఎస్ వెంకటేశ్వరరావు, రామారావు, రాములు, గంగయ్య, సత్యనారాయణ, నందారావు తదితరులు పాల్గొన్నారు.

పులిచింతలకు 74,055 క్యూసెక్కుల నీరు విడుదల

రెంటచింతల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకుగాను 3 గేట్లను 3, 5 మీటర్లు, 1 గేట్‌ను 2 మీటర్ల మేర ఎత్తి 65618 క్యూసెక్కులు, రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి అనంతరం 8437, మొత్తం 74,055 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. ఎగువన సాగర్ నుంచి 65936 క్యూసెక్కుల నీరు వస్తుంది. గురువారం అర్ధరాత్రి 12గంటల వరకు 1.0028 ఎంయుల విద్యుత్ ఉత్పత్తి జరిగింది. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానం.

మధ్యాహ్న భోజనానికి గుంటూరు బియ్యం

- ప్రత్యేకంగా ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఖరీఫ్‌లో నాణ్యమైన ధాన్యం సేకరించాలని ఆదేశాలు
- తేమ శాతం 17 కంటే తక్కువగా ఉన్నవే కొనుగోళ్లు


ఓ మిల్లులోని బియ్యపు బస్తాలు(ఫైల్‌ఫొటో)

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు గుంటూరు జిల్లా బియ్యం సరఫరా జరగనుంది. ఈ మేరకు పౌరసరఫరాల సంస్థ నుంచి ఇప్పటికే జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందాయి. ప్రభుత్వ ఆదేశాల దృష్ట్యా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల వద్ద నాణ్యమైన ధాన్యంని మాత్రమే సేకరించాలని నిర్ణయించారు. ఇందుకోసం వివిధ రకాల పరీక్షలను కొనుగోలు కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ముఖ్యంగా తేమ శాతం 17 కంటే తక్కువగా ఉంటేనే కొనుగోలు చేస్తారు. అంతకంటే ఎక్కువ ఉంటే ఆ ధాన్యాన్ని తిప్పి పంపించేసి తేమ శాతం తగ్గిన తర్వాతనే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని రైతులకు సూచిస్తారు. ప్రభుత్వ ఆదేశాలపై ఇప్పటికే గ్రామ వ్యవసాయాధికారులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, తహసీల్దార్లు, హెల్పర్స్, మిల్లర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. గత ఏడాది కంటే క్వింటాల్‌కు మద్దతు ధరని ప్రభుత్వం రూ. 69 పెంచింది. దీని వలన కామన్ వెరైటీ క్వింటాల్ రూ. 2,369, గ్రేడ్-ఏ వెరైటీ ధాన్యానికి రూ. 2,389 చెల్లిస్తారు. 40 కేజీల గోనె సంచులు రూ. 4.74కి అందిస్తారు. రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించదలచిన రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. లేకుంటే ధాన్యం కొనుగోలు చేయరు.

ఐదు రకాల నాణ్యత పరీక్షలు

గ్రేడ్-ఏ వెరైటీ ధాన్యం కొనుగోలు చేసే ముందు ఐదు రకాల నాణ్యత పరీక్షలు నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం ఆదేశించింది. ధాన్యంలో వ్యర్థ పదార్థాలు, రంగు మారిన, కుచించుకుపోయిన గింజలు, తక్కువ శ్రేణివి, తేమ పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం అవసరమైన పరికరాలను సంబంధిత సిబ్బందికి అందజేశారు. పైన పేర్కొన్న ఐదు రకాల పరీక్షల్లో పాస్ అయిన ధాన్యాన్నే కొనుగోలు చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. ధాన్యం సేకరణకు టెక్నికల్ సిబ్బంది రైతుల కళ్లాల వద్దకే వచ్చి నాణ్యత పరీక్షలు జరుపుతారు. అన్ని సవ్యంగా ఉంటే రైతు వేలిముద్రని తీసుకొని ధాన్యం సేకరించి జీపీఎస్ అమర్చిన వాహనం ద్వారా మిల్లుకు తరలిస్తారు.

43,714 పాఠశాలల్లో 29.71 లక్షల మంది విద్యార్థులు

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలిపి 43,714 పాఠశాలలున్నాయి. వీటిల్లో 29 లక్షల 71 వేల 238 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. వీళ్లందరికి మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన భోజనాన్ని వడ్డించాల్సి ఉంటుంది. వీటన్నింటికి కలిపి దాదాపుగా 4 లక్షల 45 వేల 68 మెట్రిక్‌టన్నుల బియ్యం అవసరమౌతాయి. పాఠశాలలే కాకుండా హాస్టల్స్, అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటికి ప్రతీ ఆరు నెలలకు మరో 58 వేల 26 మెట్రిక్‌టన్నుల బియ్యం అవసరమౌతాయి.

90 మిల్లులున్నా 24 మంది మాత్రమే ఆర్‌ఎస్‌కేలలో కొనుగోళ్లు

గుంటూరు జిల్లాలో మొత్తం 90 రైస్‌మిల్లులు ఉన్నాయి. కాగా వీళ్లలో 24 మంది మిల్లర్లు మాత్రమే రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు బియ్యం మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేయాలంటే చాలా కష్టం. ఈ సమస్యని అధిగమించేందుకు మిల్లర్లందరిని, రైతులకు అనుసంధానం చేసి రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేయించాల్సి ఉంది. తేమ శాతం విషయంలో మిల్లర్లు కొంత అభ్యంతరాలు వ్యక్తం చేస్తోన్నారు. ఈ విషయంలో జాయింట్ ఎనాలిసిస్ జరపాలని కోరుతున్నారు.

మునిసిపాలిటీల్లో ఈడీసీ

- నాలాకు బదులు కొత్త విధానం అమలు
- భూమి విలువలో నాలుగు శాతం పన్ను



సత్తెనపల్లి పురపాలక సంఘ కార్యాలయం

సత్తెనపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చడానికి గతంలో నాలా ట్యాక్స్ అమల్లో ఉండేది. ప్రజా సౌలభ్యం కోసం దీన్ని రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల కిందట రద్దు చేసింది. దీంతో అనేక ప్రాంతాల్లో ఎటువంటి పన్ను చెల్లించకుండా వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేసి.. నాలాకు బదులు ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ చార్జెస్(ఈడీసీ) విధానాన్ని అమలు చేయాలని సెప్టెంబరు 3న ఆదేశాలు జారీ చేసింది. దీని అమలుపై గత బుధవారం ప్రత్యేక జీవో కూడా విడుదలైంది. దీని ప్రకారం కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీల్లో కూడా టౌన్ ప్లానింగ్ చట్టం 1920 కింద అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. 2006 జనవరి 2కు ముందు ప్లాట్లుగా చేసిన భూములకు ఈ చట్టం వర్తించదని స్పష్టం చేసింది. గతంలో నాలా పన్నులు వసూలు చేస్తే కేవలం రెవెన్యూ శాఖకు నగదు జమ అయ్యేది. దీన్ని బదలాయించాల్సి ఉన్నా ప్రత్యేక అజమాయిషీ లేక పోవడంతో ప్రభుత్వ ఖజానాకు జమ అయ్యేది. కాని కొత్త విధానంలో నిధులు మొత్తం మునిసిపాలిటీలోని మౌలిక సదుపాయాల కల్పన, రోడ్లు, ఫ్లై ఓవర్, బ్రిడ్జిలు, పార్కుల అభివృద్ధికి వినియోగించుకోవచ్చు. దీన్ని అమలు చేసే బాధ్యత ఆయా మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థల కమిషనర్లకు అప్పగించింది. నిబంధనల ప్రకారం నాలా చెల్లించని లే అవుట్ దారులు.. కొత్తగా ప్రవేశ పెట్టిన ఈడీసీ చట్టం ప్రకారం పన్నులు చెల్లిస్తే పురపాలక సంఘాలకు అదనంగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ, మునిసిపల్ అధికారులపై ఉంది.

ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు

గతంలో లే అవుట్లు వేయాలంటే మునిసిపాలిటీల్లో దరఖాస్తు చేసుకుంటే సరి పోయేది. కాని ప్రస్తుతం అన్ని అనుమతులు ఆన్‌లైన్‌లో ఏపీ డీసీఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లోనే సంబంధిత రుసుం చెల్లించాలి. మొత్తం భూమి, వాటి విలువ, ఏ ప్రాంతంలో ఉందనే వివరాలను అందులో పొందుపరచాలి. భూమి విలువలో నాలుగు శాతం ఈడీసీగా చెల్లించాలి. ఇందులో 85 శాతం నిధులు ఆయా మునిసిపాలిటీల ఖాతాల్లోను, మిగిలిన 15 శాతం అభివృద్ధి అథారిటీకి వెళ్తుంది. ఇందులో తప్పుడు సమాచారం ఇచ్చి రిజిస్ట్రేషన్‌లు చేసుకుంటే రెట్టింపు జరిమానా విధిస్తారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే అనుమతులు పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

బాపట్లలో..
కారవాన్ టూరిజం



సూర్యలంక సముద్రతీరంలో ప్రదర్శన కోసం ఉంచిన కారవాన్

- సూర్యలంక తీరంలో కొలువు తీరిన వాహనం
- పర్యాటక ప్రాంతాలను వీక్షించే అద్భుత అవకాశం

బాపట్ల, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలను తనివి తీర పర్యాటకులు తిలకించి, ఆస్వాదించేలా పర్యాటకశాఖ మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అధునాతన హంగులతో కూడిన కారవాన్ బస్సును ఏర్పాటు చేసింది. ఇందులో ప్రయాణిస్తూ పర్యాటక ప్రదేశాలను సందర్శించే అద్భుతమైన అవకాశం కల్పించింది. బాపట్ల మండలంలో అత్యంత ఆహ్లాదకరమైన సూర్యలంక సముద్రతీరంలో యాత్రికుల సందర్శన కోసం కారవాన్‌ను ఉంచారు. దీనిని ఇప్పటికే కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పర్యాటకశాఖాధికారులతో కలిసి పరిశీలించారు. కారవాన్‌లో ఎక్కిన దగ్గర నుంచి దిగే వరకు అన్ని సౌకర్యాలు అందులోనే ఉంటాయి. దూరప్రాంతాలు నుంచి ఈ బస్సులో షికారు చేస్తూ.. బాపట్ల సముద్ర తీరానికి వచ్చి సరదాగా గడిపి మళ్లీ తిరిగి గమ్య స్థానాలకు చేరే ప్రణాళిక రూపొందించారు.

15 మంది వరకు ప్రయాణించవచ్చు..

సముద్రతీరం నుంచి బయలు దేరే ఈ బస్సులో 300 కిలోమీటర్ల మేర ప్రయాణం చేయవచ్చు. బాపట్ల జిల్లాలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు కారవాన్ టూరిజం ప్రారంభించారు. బీచ్‌లలో వసతి సమస్యకు పరిష్కారంగా విలాసవంతమైన ఈ బస్సు ఉపయోగపడుతుంది. ఈ బస్సులో 15 మంది వరకు ప్రయాణించి.. బస చేయవచ్చు. సాధారణ ప్రయాణం కంటే తక్కువ ఖర్చుతో బీచ్‌లు, ఆలయాల సందర్శన ఉంటుంది. హైదరాబాద్ వంటి నగరాలు నుంచి వారాంతాలు, పండుగ సెలవుల్లో వేలాది మంది పర్యాటకులు బాపట్ల జిల్లాలోని సూర్యలంక, రామాపురం, వాడరేవు బీచ్‌లకు వస్తుంటారు. దీంతో పర్యాటక శాఖ కాటేజీలు, ప్రైవేట్ రిసార్ట్స్‌లు నెలరోజుల ముందే పూర్తిగా బుక్ అయిపోతున్నాయి. సరైన వసతి లేక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో పర్యాటక శాఖ ఈ కారవాన్‌లు నడపనుంది.

రూ.50 వేల లోపే అన్ని సౌకర్యాలు..

● హైదరాబాద్ నుంచి కార్లలో బాపట్ల బీచ్‌లకు వస్తే ప్రయాణం, బస, ఇతర ఖర్చులు కలిపి రూ.60 వేలు నుంచి రూ.70 వేల వరకు అవుతాయి. కారవాన్ ప్యాకేజి రూ.40వేల నుంచి రూ.50వేల ఖర్చుతోనే యాత్రను పూర్తి చేయవచ్చు. సౌకర్యవంతంగా బస చేయవచ్చు. బస్సులోనే వంట మనిషి, పర్యాటక ప్రదేశాలు గురించి వివరించేందుకు ఒక గైడ్ కూడా ఉంటారు. పర్యాటకులు కోరినచోట వాహనాన్ని ఆపి విశ్రాంతి తీసుకునే వెసులబాటు ఉంది.

కారవాన్ ప్యాకేజీ ఇలా..

● కారవాన్ ప్యాకేజిలో భాగంగా సూర్యలంక, రామాపురం, ఓడరేవు బీచ్‌లతోపాటు బాపట్ల భావన్నారాయణస్వామి దేవాలయం, మోటుపల్లి వీరభద్రస్వామిఆలయం, చీరాల వస్త్రపరిశ్రమ, వేటపాలెం జీడిపప్పు కేంద్రాలను సందర్శించవచ్చు. అదేవిధంగా నిజాం పట్నం హార్బర్ కూడా వెళ్ళవచ్చు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సూర్యలంక సముద్రతీరంలో సందర్శన కోసం ఉంచి కారవాన్‌ను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. ఏసీ బెడ్‌రూమ్, టాయిలెట్స్, ఇంటర్నెట్, వైఫై, టీవీ, ఫ్రిడ్జ్, సోఫా సెట్ వంటి విలాసవంతమైన సౌకర్యాలు ఈ బస్సులో ఉన్నాయి.

కారవాన్‌లో పర్యాటకుల కోసం కల్పించిన వసతులు





నిరంతరాయ
విద్యుత్ సరఫరాలో అలసత్వం వద్దు

- ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు తక్షణం స్పందించాలి
- స్కాడా సెంటర్‌లో టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్ ఆకస్మిక తనిఖీలు


స్కాడా సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్, ఈఈ శ్రీనివాసబాబు

గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): నిరంతరాయ విద్యుత్ సరఫరాలో ఎవరూ అలసత్వం చూపొద్దని ఏపీ సీపీ డీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్ ఆదేశించారు. జిల్లా కేంద్రం గుంటూరు సంగడిగుంట వద్దనున్న విద్యుత్ భవన్‌లోని స్కాడా సెంటర్‌లో ఆయన శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం గుంటూరు, తెనాలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)లు, డిప్యూటీ ఈఈలు, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సెక్షన్ కార్యాలయాల స్థాయిలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై స్పందించడం లేదన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై వినియోగదారుల నుంచి వచ్చే ఫ్యూజ్ ఆఫ్ కాల్‌కు తక్షణమే స్పందించాలని సూచించారు. వ్యవసాయ కనెక్షన్‌లను ఎప్పటికప్పుడు విడుదల చేయాలన్నారు. గుంటూరు టౌన్-1 ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు పలువురు అధికారులున్నారు.

మగవాళ్లకూ ‘స్త్రీ శక్తి’ టిక్కెట్లు

- నలుగురు కండక్టర్‌ల సస్పెన్షన్
- టీటీఐల తనిఖీల్లో అక్రమాలు వెలుగులోకి

గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమల్లోకి తీసుకొచ్చిన స్త్రీ శక్తి పథకం క్షేత్రస్థాయిలో పక్కదోవ పట్టే ప్రయత్నం జరుగుతోంది. కొందరు కండక్టర్‌లు మగవాళ్లకూ స్త్రీ శక్తి పథకం కింద జీరో ఫెయిర్ టిక్కెట్‌లను జారీ చేయడం ఇటీవల టీటీఐల తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. ఆయా అక్రమాలపై విభజిత జిల్లాలో నలుగురు కండక్టర్‌లపై సస్పెన్షన్ వేటు పడింది. కండక్టర్‌ల సస్పెన్షన్ జిల్లాలోని ఆర్టీసీ వర్గాల్లో కలకలం రేకెత్తిస్తోంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ మేరకు ఈ ఏడాది ఆగస్టు 15న స్త్రీ శక్తి పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ పథకంలో భాగంగా బస్సు ఎక్కిన మహిళలకు జీరో ఫెయిర్ టిక్కెట్లను అందజేయాల్సి ఉంటుంది. మహిళా ప్రయాణికులు తమ ఆధార్ ఏదైనా గుర్తింపు కార్డులు కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డులు చూసి జీరో టిక్కెట్లు అందజేయాలి. అయితే క్షేత్రస్థాయిలో ఈ పథకం మాటున అక్రమాలు జరుగుతున్నట్లు ఇటీవల టీటీఐల తనిఖీల్లో తేలింది. సాధారణంగా బస్సుల్లో ట్రావెలింగ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ (టీటీఐ)లు టిక్కెట్లను తనిఖీలు చేస్తుంటారు. ఇదే క్రమంలో ఇటీవల టీటీఐలు జరిపిన తనిఖీల్లో మగవాళ్లకు కూడా స్త్రీ శక్తి పథకం కింద టిక్కెట్లు ఇవ్వడం గుర్తించారు. వెంటనే కేసు నమోదు చేసిన టీటీఐలు సదరు డిపో మేనేజర్‌లకు తెలియజేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన డిపో మేనేజర్లు క్రమశిక్షణ చర్యల కింద సస్పెన్షన్ వేటు వేశారు. గుంటూరు-1 డిపోలో ఒకరు, గుంటూరు-2 డిపోలో ఇద్దరు, తెనాలి డిపోలో ఒకరు మొత్తం నలుగురు సస్పెండ్ అయినట్లు తెలిసింది. అయితే కండక్టర్‌లు కావాలని మగవాళ్లకు జీరో టిక్కెట్లు ఇచ్చి అనధికారికంగా నగదు తీసుకున్నారా? లేక పొరపాటుగా జీరో టిక్కెట్లు ఇచ్చారా అనే విషయాలపై లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమాలు తేలితే కఠిన చర్యలు తప్పవు

బస్సుల్లో ఇటీవల కొందరు కండక్టర్లు మగవాళ్లకు స్త్రీ శక్తి పథకం కింద టిక్కెట్లు అందజేసినట్లు తనిఖీల్లో తేలిందని జిల్లా ప్రజారవాణాధికారి విమల పేర్కొన్నారు. డిపో మేనేజర్ల స్థాయిలో క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ చేశామన్నారు. పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామని, అక్రమాలు తేలితే ఉద్యోగం నుంచి కూడా తొలగింపు తప్పదన్నారు.

వారం రోజులు..32 రైళ్ల రద్దు

- వందేభారత్, కృష్ణా ఎక్స్‌ప్రెస్ రీషెడ్యూల్
- గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఖాజీపేట వరకే..
- డోర్నకల్ సెక్షన్‌లో ట్రాక్ మరమ్మతులు

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్ - పాపటపల్లి మధ్య మూడోలైన్ మరమ్మతుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే 32 రైళ్లను వారం పాటు రద్దు చేసింది. మరికొన్నింటిని రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పులు శనివారం నుంచి 18వ తేదీ వరకు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్లలో ప్రధానంగా డోర్నకల్-ఖాజీపేట్, విజయవాడ - డోర్నకల్ మెమో ప్యాసింజర్లు, సికింద్రాబాద్ - గుంటూరు ఇంటర్ సిటీ, విశాఖపట్నం - న్యూఢిల్లీ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్, ఏపీ ఎక్స్‌ప్రెస్, పూరి-ఓకా ద్వారకా ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లు ఉన్నాయి. అలాగే, ఆదిలాబాద్ - తిరుపతి మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13, 16, 17 తేదీల్లో గంటన్నర ఆలస్యంగా రీషెడ్యూల్ అయింది. విశాఖపట్నం - సికింద్రాబాద్, సికింద్రాబాద్ - విశాఖపట్నం వందేభారత్ ఎక్స్ ప్రెస్‌లు ఈ నెల 15, 16, 18 తేదీ ల్లో గంటన్నర ఆలస్యంగా బయల్దేరనున్నాయి. సికింద్రాబాద్ - గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను 14 నుంచి 18 వరకు ఖాజీపేట్ - గుంటూరు మధ్య పాక్షికంగా రద్దయింది. అంటే, ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ఖాజీపేట వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఖాజీపేట నుంచి బయల్దేరుతుంది.

శబరి ఎక్స్‌ప్రెస్‌లో కోచ్ మార్పు

సికింద్రాబాద్ నుంచి త్రివేంద్రానికి శనివారం బయల్దేరనున్న శబరి (20629) ఎక్స్‌ప్రెస్‌లో ఫస్ట్ ఏసీ కోచ్‌కు బదులుగా అదనంగా సెకండ్ ఏసీ కోచ్‌ను జత చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ఫస్ట్ ఏసీ బోగీలో మెకానికల్ సమస్యలు తలెత్తడంతో దాని స్థానంలో కోచ్ మార్పు అనివార్యమైందని పేర్కొన్నారు. ఫస్ట్ ఏసీలో రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు సెకండ్ ఏసీలో బెర్తులు కేటాయించనున్నారు.

ఆయేషా తల్లిదండ్రులకు
దర్యాప్తు నివేదిక అందజేయండి!

- అధికారులకు సీబీఐ కోర్టు ఆదేశం

విజయవాడ, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసు దర్యాప్తు నివేదికను ఆమె తల్లిదండ్రులకు అందజేయాలని.. సీబీఐ అధికారులను విజయవాడ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం శుక్రవారం ఆదేశించింది. ఆయేషా మీరా హత్య కేసులో తిరిగి దర్యాప్తు చేపట్టిన సీబీఐ.. దర్యాప్తు ముగిసిన అనంతరం నివేదికను కోర్టుకు సమర్పించింది. ఈ నివేదికను తమకు అందజేయాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది విచారణ దశలో ఉంది. ఈ కేసులో నిందితుడిగా పేర్కొన్న పిడతల సత్యంబాబుపై నమోదైన అభియోగాలపై అభ్యంతరాలు చెప్పాలని, కోర్టుకు హాజరై వివరించాలని సీబీఐ కోర్టు వారికి నోటీసులు జారీచేసింది. నోటీసులు తీసుకోవడానికి నిరాకరించిన ఆయేషా తల్లిదండ్రులు.. దర్యాప్తు నివేదికను తమకు ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఆయేషా తల్లిదండ్రుల తరఫున న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, సీబీఐ తరఫున గోపీనాథ్ వాదనలు వినిపించారు. దీనిపై న్యాయాధికారి అన్నపూర్ణ శుక్రవారం తీర్పు ఇచ్చారు. దర్యాప్తు నివేదికను ఆయేషా తల్లిదండ్రులకు అందజేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేశారు.

దుర్గమ్మ ఆలయ..చీరల వేలం
రూ.8.15కోట్లు

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించే పట్టుచీరలు, సాధారణ , కాటన్ చీరలు, జాకెట్టు ముక్కలు, ఎర్ర రంగు చీరలు, రవికముక్కలు,



దుర్గగుడి ప్రాంగణంలో చీరల వేలం కౌంటర్

కాంట్రాక్ట్ దక్కించుకున్న గుంటూరు మహిళ

వివిధ రకాల వస్త్రాలను విక్రయించకొను లైసెన్స్ హక్కుకు శుక్రవారం మహా మండపం 6వ అతస్తులో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహించారు. ప్రథమ దరావత్తు రూ.50,00,000లు చొప్పున డీడీ చెల్లించి బహిరంగ వేలం పాటలో ముగ్గురు పాల్గొన్నారు. గుంటూరుకు చెందిన మెస్సర్స్ శ్రీపావని కలెక్షన్స్ యజమాని నల్లూరి పావని మొదటి సంవత్సరానికి రూ.8,15,00,000లతో పాటు అదనంగా 5శాతం జీఎస్టీ చెల్లించేందుకు, రెండో సంవత్సరానికి మొదటి సంవత్సరపు లైసెన్స్ సొమ్ముపై 10శాతం అదనంగా చెల్లించేలా హెచ్చు పాట పాడుకున్నారు. ఇ-టెండర్ సీల్డ్ టెండర్‌లో ఎవరూ పాల్గొనలేదు. ఈ నెల ఒకటిన టెండర్ కం వేలం పాటకు ప్రకటన ఇచ్చారు. గత ఏడాది రూ.6,04,24,445లు కంటే ప్రస్తుతం సుమారు 35 శాతం అధికంగా శుక్రవారం బహిరంగ వేలం పాటలో వచ్చిన హెచ్చు రేటుకు ఖరారు చేస్తూ దేవదాయ కమిషనర్‌కు నివేదిక పంపినట్టు ఈవో శీనానాయక్ తెలిపారు.

2016 నుంచి ఇప్పటి వరకు వచ్చిన ఆదాయం

2016 నుంచి ఇప్పటి వరకు దుర్గగుడిలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు వేలం వేయగా ఆయా సంవత్సరాలలో వచ్చిన ఆదాయాల వివరాలు ఇలా ఉన్నాయి. 2016-17లో అప్పటి ఈవో ఐఏఎస్ అధికారిణి సూర్యకుమారి ఆధ్వర్యంలో రూ. 1.74కోట్లు, మరుసటి సంవత్సరం రూ.2. 80 కోట్లు వచ్చింది. 2018-19లో ఐఆర్ఎస్ అధికారిణి కోటేశ్వరమ్మ ఈవోగా ఉన్న సమయంలో రూ.8.10 కోట్లు వచ్చింది. 2019-20లో సురేష్ బాబు ఈవోగా నిర్వహించిన చీరల వేలంలో రూ.5.11 కోట్లు వచ్చింది. తర్వాత సంవత్సరం కొవిడ్ సమయంలో రూ.3.30కోట్లు వచ్చింది. ఆ తరువాత దర్భముళ్ల భ్రమరాంబ ఈవోగా వేలంలో వరుసగా రూ.3.10 కోట్లు, రూ.5కోట్లు వచ్చింది. 2023-24లో రామారావు ఈవోగా వేలంలో రూ.5కోట్లు వచ్చింది. ఈ ఏడాది ఈవో వీకే శీనానాయక్ ఆధ్వర్యంలో వేలంలో రూ.8.15కోట్లు ఆదాయం వచ్చింది.

మానవత్వం చాటుకున్న మంత్రి సవిత

తాడేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చేనేత, జౌళి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాదానికి గురై నిస్సహాయ స్థితిలో పడి ఉన్న వృద్ధుడికి సపర్యలు చేసి.. తన కాన్వాయ్‌లోని వాహనంలో ఎక్కించి సమీప ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ఘటన చూసిన వాహనదారులు, పాదాచారులు మంత్రి సవిత మానత్వాన్ని అభినందించారు. విజయవాడ నుంచి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయానికి మంత్రి సవిత వస్తున్నారు. క్యాంప్ కార్యాలయ సమీపంలో హైవేపై శుక్రవారం రాత్రి వడ్డేశ్వరం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధుడు తీవ్ర అనారోగ్యంతో ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయాడు. ఇది గమనించిన మంత్రి 108 వాహనం వచ్చేవరకు ఆగకుండా తక్షణమే స్పందించి ఎస్కార్ట్ వాహనం ద్వారా సమీపంలోని ఎయిమ్స్‌కు అతనిని తరలించారు. దీంతో హైవేపై ట్రాఫిక్ కొద్ది సేపు స్తంభించింది. ఎటువంటి అధికార దర్పం చూపకుండా మంత్రి సవిత గతంలోనూ ఇదే రహదారిపై క్షతగాత్రులకు సాయం అందించారు.


రోడ్డుపై పడిపోయిన వృద్ధుడి పరిస్థితి తెలుసుకుంటున్న మంత్రి

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు భూకైలాస్ పౌరాణిక పద్య నాటకం

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భువనచంద్ర టౌన్ హాల్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో భూ కైలాస్ పౌరాణిక పద్య నాటకం ప్రదర్శించనున్నారు. నెలవారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఈ నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు కమిటీ ఛైర్మన్ జె.వెంకట్రావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, శాసన సభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొంటునట్లు చెప్పారు. ఉషోదయ నాట్య మండలి, చెరుకుపల్లి వారు ప్రదర్శించే ఈ నాటకాన్ని పట్టణ ప్రేక్షకులు, కళాభిమానులు విచ్చేసి తిలకించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రొంపిచర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, మర్రిచెట్టుపాలెం, బుచ్చిపాపన్నపాలెం, సుబ్బయ్యపాలెం, సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ రాంబాబు శుక్రవారం తెలిపారు. మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపి వేస్తున్నట్టు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా ఉండదన్నారు. మూడో ఫేజ్ కరెంటు శనివారం ఉదయం ఒంటి గంట నుంచి 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

● ఈపూరు: మండలంలో విద్యుత్ సరఫరాను శనివారం నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్.గాంధీబాబు తెలిపారు. మరమ్మతుల నిమిత్తం ఈపూరు, ముప్పాళ్ళ, కొచ్చర్ల, ఊడిజెర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని బొల్లాపల్లి, రేమిడిచర్ల సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయటం జరుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం తెలిపారు.

'ప్రభుత్వ రంగంలోనే ప్రజారోగ్య వ్యవస్థను కొనసాగించాలి'

శావల్యాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్య వ్యవస్థను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శావల్యాపురంలో రైల్వేస్టేషన్ మార్గంలో అఖిలపక్ష నాయకులు శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలను ప్రైవేటురంగానికి అప్పగించడం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడమేనని, అంతర్జాతీయ రాజధానిని నిర్మించే పాలకులకు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే మెడికల్ కళాశాలలను నిర్మించలేకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో పల్నాడు విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్ట్ గుంటూరు విజయ్ కుమార్, పల్నాడు జిల్లా జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి సంద్రపాటి చలపతిరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు తోట ఆంజనేయులు, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

23న అమరావతిలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నిరసన ప్రదర్శన

నరసరావుపేట టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి నిరసనగా అమరావతిలో 23న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నామని ఎంఆర్‌పీఎస్ పల్నాడు జిల్లా ఇన్‌చార్జి దుడ్డు రామకృష్ణ అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణంలో పల్నాడు జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దుడ్డు రామకృష్ణ మాట్లాడుతూ జస్టిస్ గవాయిపై దాడి న్యాయవ్యవస్థ, రాజ్యాంగ స్ఫూర్తి మీద దాడి చేయడమే అన్నారు. కార్యక్రమంలో దాసరి నాగయ్య, కోడవటి అశోక్‌మాదిగ, ఎం.సత్యానందం, డి.సుశీల పాల్గొన్నారు.

వినాయక స్వామికి అభిషేకాలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలపాడురోడ్డు ప్రశాంతినగర్‌లోని చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో సంకటహర చదుర్థి సందర్భంగా శుక్రవారం వినాయకస్వామికి అభిషేకాలు నిర్వహించారు. గరికతో వినాయకవత్రం చేశారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

వినుకొండ టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత సుప్రీంకోర్టులో ఈ నెల 6న జరిగిన దురదృష్టకర సంఘటనకు నిరసనగా శుక్రవారం వినుకొండ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ ఇలాంటివి పునరావృత్తం కాకుండా తగుచర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మీసాల శ్రీనివాసరావు, సెక్రటరీ పఠాన్ గౌస్‌మొహిద్దీన్‌ఖాన్, వైస్ ప్రెసిడెంట్ పీవీ రమణారెడ్డి తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

18న చెకుముకి పోటీలు

వినుకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18న చెకుముకి సైన్స్ సంబరాల ప్రతిభా పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు కమలారామ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరిస్తూ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని జనవిజ్ఞాన కార్యదర్శి బి.రవికుమార్ కోరారు.

యోగా, ధ్యానంతో ఒత్తిడిని అధిగమించవచ్చు

నాదెండ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): యోగా, ధ్యానంతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని జిల్లా బాలికా సంరక్షణ అధికారి డీ రేవతి అన్నారు. మండలంలోని నాదెండ్లలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో జరిగిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్య కౌన్సిలర్ ఫణీంద్ర కుమార్ ఒత్తిడిని అధికమించేందుకు జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవీలత, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీఎస్‌టీ 2.0తో అందరికీ ప్రయోజనం

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ 2.0 సంస్కరణలతో ఎలక్ట్రానిక్ వస్తువులపై పన్నురేట్లు గణనీయంగా తగ్గాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్‌టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట మున్సిపల్ హైస్కూల్‌లో ఎగ్జిబిషన్ సేల్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ గతంలో 18 శాతం నుంచి 28 శాతం వరకు ఉండేవన్నారు. ఇప్పుడు చాలా వస్తువులకు 5 శాతం నుంచి 12 శాతం వరకు మాత్రమే వర్తిస్తున్నాయని చెప్పారు. వినియోగదారులకు రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు ఆదా అవుతుందన్నారు. సోనోవిజన్ ఎలక్ట్రానిక్స్, విజేత ఎలక్ట్రానిక్స్, ఆర్ఆర్ డిజిటల్ అండ్ పర్నిచర్ వంటి స్థానిక వ్యాపారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు.

● నాదెండ్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జీఎస్టీ - 2.0 సంస్కరణల ప్రతి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా తెలియజేయాల్సిన అవసరం ఉందని గుంటూరు-2 డివిజన్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్‌సన్ అన్నారు. మండలంలోని గణపవరంలో భాను హోమ్ నీడ్స్ ఎలక్ట్రానిక్స్ వారు ఏర్పాటుచేసిన ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శనను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపునకు ముందు, తరువాత ధరల వ్యత్యాసంపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరికరాల ధరలు తగ్గాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఏఈసీలు పీవీ రంగయ్య, కే సుజాత, కార్యదర్శి మారుతీ బాబు, నోడల్ అధికారులు నిత్యానందం, సునీల్ బాబు, సాయి చంద్ పాల్గొన్నారు.

● శావల్యాపురం: జీఎస్టీ తగ్గింపుతో ఎన్డీఏ ప్రభుత్వం పేదలకు ఎంతో ఆర్థిక చేయూతను అందించిందని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. గౌరీ శంకర్ పర్నీచర్ అండ్ ఎలక్ట్రికల్ వారి ఆధ్వర్యంలో శావల్యాపురం సెంటర్‌లోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద జీఎస్టీ తగ్గింపుపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో యాకోబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత పాల్గొన్నారు.

● నూజెండ్ల: సూపర్ జీఎస్టీ ద్వారా కేంద్ర ప్రభుత్వం తగ్గించిన పన్నుభారం సామాన్య ప్రజలకు వస్తుసేవల వినియోగంలో ఊరటనిస్తుందని నూజెండ్ల పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ బచ్చు అంజిరెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వీ ఉమాదేవి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల సామాన్యులపై పన్ను ప్రభావం తగ్గిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగూర్‌లాలు, కార్యాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపును తెలియజేస్తున్న ఎంపీడీవో ఉమాదేవి

అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి

● శావల్యాపురం ఎంపీడీవో సీతారామయ్య



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి నుంచి చెత్తసేకరణ, గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచి, పచ్చదనాన్ని పెంపొందింపజేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషిచేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. థీమ్5, క్లీన్‌అండ్‌గ్రీన్ విలేజ్ కార్యక్రమంపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్ల వెంబడి, ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్లలో ప్రజలంతా మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంచాలన్నారు. పారిశుధ్య కార్మికులకు సకాలంలో వేతనాలందించి ఇంటింటికీ చెత్తసేకరణ సజావుగా జరిగేలా చూడాలన్నారు. చెత్తసేకరణ కేంద్రాలను వాడుకలోకి తెచ్చి ఘనవ్యర్థాల నిర్వహణ ద్వారా వర్మీ కంపోస్ట్ ఎరువులు తయారుచేసి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో యాకోబు, రిసోర్స్‌పర్సన్ అరుణభారతి పాల్గొన్నారు.

ఈకేవైసీని త్వరితగతిన పూర్తిచేయాలి: వినుకొండ క్లస్టర్ ఏపీడీ బూసిరెడ్డి

శావల్యాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే ఉపాధి హామీ పనుల్లో పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన శ్రామికుల ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఫీల్డ్ అసిస్టెంట్లు వేగవంతంచేసి త్వరితగతిన పూర్తిచేయాలని వినుకొండ క్లస్టర్ ఏపీడీ ఈపూరి బూసిరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శ్రామికుల ఈకేవైసీ నమోదును శుక్రవారం తనిఖీచేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో శ్రామికులు ఇళ్ళవద్ద ఉండే సమయంలో ఈ కేవైసీ నమోదు చేయించాలన్నారు. ఈ కేవైసీ నమోదులో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్ పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో డేటా అనలిస్ట్ ఉద్యోగాలకు వర్క్‌షాప్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో హైదరాబాదు ఇన్ఫోసిస్ కంపెనీ సీఎస్‌సీ, డీఈటీ విభాగాలు సంయుక్తంగా డేటా అనలిస్ట్ ఉద్యోగాలకు మూడు రోజుల వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా ఇన్ఫోసిస్ టీమ్ లీడ్ షేక్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు వర్క్‌షాపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, అధ్యాపకులు, బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేయాలి: రీజనల్ డైరెక్టర్ హరికృష్ణ

నరసరావుపేట రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో డోర్ టూ డోర్ సర్వే నిర్వహించి ఆస్తి పన్ను, నీటి పన్ను వసూలు చేయాలని పురపరిపాలనా శాఖ రీజనల్ డైరెక్టర్ ఎస్.హరికృష్ణ ఆదేశించారు. నరసరావుపేట పురపాలక సంఘ పరిధిలో పన్ను విధింపు కోసం జరుగుతున్న సర్వేపై, పన్ను వసూళ్ల పురోగతిపై వార్డు సచివాలయ పరిపాలనా కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గుంటూరు ఆర్డీ ఎస్.హరికృష్ణ పన్ను బకాయిల స్పెషల్ డ్రైవ్‌పై సమీక్షించారు. కార్యక్రమంలో కమిషనర్ యం.జస్వంతరావు, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, ఎస్.జెయిలీబాబు, సయ్యద్ జహంగీర్, వార్డు సచివాలయ పరిపాలనా కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియాకు ఎలాంటి కొరత లేదు: డీఏవో

నాదెండ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు అన్నారు. సాతులూరు గ్రామ పరిధిలో గల రైల్వే ర్యాంక్ పాయింట్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా లారీలకు లోడు చేస్తున్న యూరియా వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం పల్నాడు జిల్లాకు 1970 మెట్రిక్ టన్నుల ఎన్ఎఫ్ఎల్ యూరియా కేటాయించటం జరిగిందన్నారు. ఆయన వెంట ఏడీఏ కేవీ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి పీ శ్రీలతలు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కృష్ణ, భూమి పత్రాలు చూపుతున్న రైతులు

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం కోనూరులో అక్రమ నకిలీ పత్రాలతో భూములను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తున్న వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని అచ్చంపేట మండలం, కోనూరు గ్రామ ఎస్సీ కాలనీ వాసులు వేమవరపు కృష్ణ, కోనూరు ది ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ సభ్యులు శుక్రవారం కలెక్టర్ కృతికా శుక్లాకు ఫిర్యాదు చేశారు. తమ పూర్వీకుల ద్వారా 1923వ సంవత్సరంలో కోనూరు ది ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ నెంబర్ 305 ద్వారా రిజిష్టర్ చేయించుకున్నామన్నారు. కోనూరు గ్రామానికి చెందిన శాఖమూరి శ్రీనివాసరావు 82 సంవత్సరాల నుంచి మా స్వాధీన అనుభవంలో వున్న భూములకు నకిలీ పత్రాలు పుట్టించాడన్నారు. నకిలీ పత్రాలు రద్దుచేసి భూముల ఆక్రమణకు యత్నిస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి, తమకు పాసు పుస్తకాలు ఇప్పించాలని కలెక్టర్ వినతి పత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తానని రైతులకు కలెక్టర్ హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న బూదాల శ్రీనివాసరావు

మున్సిపల్ చైర్‌పర్సన్ మొండివైఖరి విడనాడాలి

● ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు

వినుకొండటౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులపై మున్సిపల్ చైర్‌పర్సన్ దస్తగిరి మొండివైఖరి విడనాడాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు అన్నారు. చైర్‌పర్సన్ వైఖరికి నిరసనగా ఏఐటీయూసీ వినుకొండ నియోజకవర్గం సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో చైర్మన్ దస్తగిరి విఫలమయ్యారని ఆరోపించారు. వినుకొండ మున్సిపాలిటీలో పర్మినెంట్ ఉద్యోగులు ప్రతాపుల భీమరాజు, ప్రతాపుల గురవయ్యలు పసుపులేరు బ్రిడ్జి వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించారన్నారు. జీవో ప్రకారం వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన ఉద్యోగాలు, అదనపు ప్రయోజనాలు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాయబారం వందనం, కొప్పరపు మల్లికార్జున, వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాచపూడి ఏసు పాదం, సంపెంగల అబ్రహం రాజు, కంచర్ల కోటేశ్వరరావు, తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.



బీఎస్నార్‌ను సత్కరిస్తున్న ఆర్కే మిత్రమండలి సభ్యులు

శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సభ్యుడికి సత్కారం

వినుకొండ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా (ధర్మకర్తల మండలి) నియమితులైన బోడేపూడి వెంకట సుబ్బారావు (బీఎస్నార్) శుక్రవారం వినుకొండకు వచ్చారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ఆర్కే మిత్రమండలి ఆయనను ఘనంగా సత్కరించారు.

ఘనంగా ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

నరసరావుపేట లీగల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మానసిక ఒత్తిడి నుంచి బయటపడే జీవన విధానం గురించి మానసిక వైద్యులు డాక్టర్ పార్థసారథి వివరించారు. జిల్లా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజేశ్వరి మానసిక ఆరోగ్య కార్యక్రమం వైద్యురాలు డాక్టర్ పవిత్ర సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగుచేసుకోవాలి

● మండల వ్యవసాయ అధికారి శాంతి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ పొగాకు సాగుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగుచేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి రైతులకు సూచించారు. నరసరావుపేట మండలం పెద్దరెడ్డిపాలెంలో రైతు సేవా కేంద్రంలో రైతులతో శుక్రవారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఐ.శాంతి మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందన్నారు. అనుమతులు ఉన్నవారు మాత్రమే తెల్ల బర్లీ పొగాను సాగుచేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న, మినుము, పెసర, నాగు పంటలను వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కే బ్రహ్మయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు శైలజ రైతులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలి

● నరసరావుపేట డివిజన్ ఏడీఏ

శావల్యాపురం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ ముఫ్తి బీజిలీ యోజన పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట డివిజన్ ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం 3కిలోవాట్ల సోలార్ పలకాల ఏర్పాటుకు రూ.78వేలు, బీసీలకు అదనంగా మరో 20వేలు రాయితీగా అందిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్‌పలకాలు ఏర్పాటు చేయడమే కాకుండా రూ.200 అద్దెకూడా చెల్లిస్తుందన్నారు. సూర్యఘర్ పథకాన్ని విజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు తమవంతు సహకరించాలన్నారు. మండలంలోని 15గ్రామ పంచాయతీల్లో వీధిలైట్లు, పంచాయతీల ద్వారా నడిచే తాగునీటి పథకాలకు రూ.25లక్షల వరకు విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. విద్యుత్ బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించడం జరిగిందని, పంచాయతీ కార్యదర్శులు త్వరలో బకాయిలు చెల్లించాలన్నారు. ఏఈ నటరాజ్, లైన్‌ఇన్స్‌పెక్టర్ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా పూజలు

రొంపిచర్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో ఈ నెల 11వ తేదీన వినాయక, వెంకటేశ్వర, పార్వతి పరమేశ్వర్లు, నందీశ్వరుడు, చండీశ్వరుడు, గరుత్మంతుడు విగ్రహ ప్రతిష్ఠలు జరగనున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం విశేష పూజలు జరిగాయి. దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేద పండితులు పూజలను నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి అభినందన

నూజెండ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం శ్రీవెంకటేశ్వర స్వామి కమిటీ హైస్కూల్‌లో శుక్రవారం క్రాఫ్ట్‌ఇన్‌స్ట్రక్టర్ ఈఎస్ఆర్‌కే ప్రసాదు పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తీసుకున్న సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్.కోదండరమేష్, ఎంఈవోలు సత్యనారాయణ, రవిచంద్ర పాల్గొని అభినందనలు తెలిపారు.



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు, రైతులు

రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి

● ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలరావు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): చీరాల ఓడరేవు నుంచి నకరికల్లు అడ్డరోడ్డు వరకు 167ఏ జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులందరికీ న్యాయమైన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. శుక్రవారం నరసరావుపేట ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఆర్డీవో కార్యాలయంలో జరిగిన చర్చలలో గతంలో ప్రకటించిన రూ.కోటి 20లక్షలు కాకుండా సగానికి సగం తగ్గించి కేవలం రూ.80లక్షలు పరిహారం ఇస్తామని అధికారులు ప్రతిపాదించటం సరైనదని కాదన్నారు. ఈ హైవేలో కేసానుపల్లిలో దాదాపు 45మంది రైతులు 120 ఎకరాలు నష్టపోతున్నారని అన్నారు. వీరంతా చిన్న, సన్నకారు రైతులని, వీరి కుటుంబానికి ఇదే జీవనాధారం అన్నారు. కనీసం కేసానుపల్లిలో గ్రామసభ జరపలేద ని, రైతుల అభిప్రాయం ప్రకారం న్యాయమైన పరిహారం ఇచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు, రైతులు ఎస్.ప్రసన్నాంజనేయస్వామి, పీటర్ రాజు, ప్రకాష్‌రావు, భుజంగరావు, ఆదిబాబు, ఎల్.విజయలక్ష్మి, ఎష్.అలీషా, కే నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై విద్యార్థులకు అవగాహన

చిలకలూరిపేట, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): యువతను మత్తు మందుల బారి నుంచి రక్షించే లక్ష్యంతో పట్టణ పోలీసులు స్థానిక అసిస్ట్ సేవా సంస్థ సహకారంతో స్థానిక శారదా హైస్కూల్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ రమేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో, ముఖ్యంగా ధనిక కుటుంబాలలో, 'క్లబ్ కల్చర్' పేరుతో యువత డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ తీసుకోవడం కేవలం వ్యక్తిగత సమస్య కాదని, అది వారి కుటుంబాలను, సమాజాన్ని కూడా సర్వనాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. డ్రగ్స్ నిరోధక చర్యల కోసం 'ఈగల్' అనే ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు విద్యార్థులకు తెలిపారు. డ్రగ్స్ తీసుకునేవారు ఎక్కడైనా కనిపించినా, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియచేయాలని విద్యార్థులను కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారమివ్వాలని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయుల చేత మత్తు మందులను ముట్టము, మత్తు రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తాం అని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ జే కృష్ణ హరీష్, హైస్కూల్ హెచ్ఎం రత్నజ్యోతి పాల్గొన్నారు.

పీపీపీకి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

● వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): 17 మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతున్నామని వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులో శుక్రవారం సాయంత్రం కోటి సంతకాల గోడపత్రికను డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థులందరికీ వైద్య, విద్య అందించాలన్నదే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పల్నాడు జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి 60వేల సంతకాలను సేకరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: ఏపీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను మాజీమంత్రి విడదల రజిని పట్టణంలోని ఆమె స్వగృహంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ 45రోజులపాటు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సంతకాల సేకరణలో మేధావి వర్గాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజలు పాల్గొనాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రజల సొత్తు అని, వాటి ప్రైవేటీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమన్నారు.

కల్తీ మద్యంపై సీబీఐతో విచారణ చేయించాలి

● వైసీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో కల్తీ మద్యం తయారు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఈ కేసును సీబీఐతో విచారణ జరిపించాలని వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నమయ్య జిల్లాలో ఇంత పెద్దఎత్తున కల్తీమద్యం తయారుచేస్తుంటే ఎక్సైజ్ శాఖ అధికారులు ఏం చేస్తున్నారన్నారు. దీని వెనుక ఉన్నవారు ఎంటి వారైనాసరే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నరసరావుపేట పట్టణం, రూరల్ పరిధిలో 100 బెల్టు షాపులు ఉన్నాయని ఆరోపించారు.

తడి, పొడి చెత్తలను వేరుచేయాలి: డీఎల్‌పీవో లక్ష్మణరావు

నాదెండ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తలను వేరుచేసేలా చర్యలు తీసుకోవాలని నరసరావుపేట డీఎల్‌పీవో లక్ష్మణరావు సూచించారు. మండలంలోని ఇర్లపాడులో శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అభిప్రాయాలు తెలుసుకున్నారు. గ్రామ పరిధిలోని ఘన వ్యర్థాల కేంద్రాన్ని పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. ఆయన వెంట సర్పంచ్ కోటేశ్వరమ్మ, కార్యదర్శి కారసాల మధు తదితరులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే పశుసంపద వృద్ధి

● ఏడీఏ శ్రీనివాసమూర్తి

ఈపూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే పశుసంపద అభివృద్ధి చెందుతుందని ఏడీఏ శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని గోపువారిపాలెంలో శుక్రవారం పశువైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరాన్ని సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న ఏడీఏ మాట్లాడుతూ పశు యజమానులు ఏడాదికి ఒక దూడ పుట్టేలా ప్రణాళిక చేసుకుంటే ఆదాయం పెరుగుతుందన్నారు. వైద్యశిబిరంలో పశువులకు పలు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యుడు గోపాల్ నాయక్, ఎం.సునీత, జీ కవిత, కరుణాకరరెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ రోడ్డు హద్దుల గుర్తింపు కోసం సర్వే

ఈపూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఈపూరులో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలంటూ గ్రామస్థులు సెప్టెంబరు 22వ తేదీన కలెక్టర్‌కు అర్జీ పెట్టుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్అండ్‌బీ, రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. ఈపూరు గ్రామ హద్దులను గుర్తించారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియ చేపట్టేందుకు పంచాయతీ కార్యదర్శి సెలవులో ఉన్నారని ఆర్అండ్‌బీ ఏఈ నవ్య తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఆక్రమణదారులను గుర్తించి వారికి నోటీసులు పంపిణీచేసిన తరువాత ఆక్రమణలు తొలగించడం జరుగుతుందన్నారు. మండల సర్వేయర్ నాగరాజు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. వీఆర్వో అశోక్ పాల్గొన్నారు.